దటీజ్ 'కెప్టెన్' గిల్!



8

మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 19 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 165 | పేజీలు: 8+4 | వెల రూ.5

ఎరుపు రంగు చెవులతో అరుదైన ఏనుగు



2

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |


## పొగాకు రైతుల ప్రయోజనాలే లక్ష్యం

మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి, జూన్ 18,(మనం ప్రత్యేక ప్రతినిధి): పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని ...మిగతా 2లో

## రెండేళ్లలో కృష్ణా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమంలో విశేష పురోగతి



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం..

మంత్రులు వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర

2





# రైతుల సంక్షేమమే.. ప్రభుత్వ ధ్యేయం

### పొగాకు రకం ఏదైనా కేజీ రూ.200 తగ్గకూడదు

నో బిడ్.. లో బిడ్ ఉండకూడదు..

మార్కెట్కు వచ్చిన పంట తిరిగి వెళ్లకూడదు

బోర్డు పరిధిలో కాకుండా... అనధికార కొనుగోళ్లపై కఠిన చర్యలు

పొగాకు రైతులను ఆదుకునేలా కేంద్రంతో మాట్లాడతాం

ట్రేడర్లు, పొగాకు రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

(అమరావతి,పి.మీరాహుస్సేన్ ఖాన్,మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మార్కెట్లో పొగాకు రకం ఏదైనా కిలో రూ.200 కంటే తగ్గడానికి వీల్లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో పొగాకు రైతులు, ట్రేడర్లతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించి పొగాకు ధరలపై సమీక్షించారు. ఇటు రైతులు, అటు ట్రేడర్ల సమస్యలను తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు రైతులను ఆదుకునేందుకు ట్రేడర్లు, కొనుగోళ్ల కంపెనీలు నూటికి నూరు శాతం మానవీయ కోణంలో రైతులకు సహకరించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పొగాకు వేలం కేంద్రాల్లో నో బిడ్, లో బిడ్ అనే మాటలకు తావుండకూడదన్నారు. రైతులు మార్కెట్టుకు తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపే పరిస్థితులు అస్సలు ఉండకూడదని చెప్పారు. మార్కెట్లోకి వచ్చిన పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. దీనికి అనుగుణంగా అన్ని పొగాకు వేలం ప్లాట్ఫారమ్లను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని చేయాలని ఆదేశించారు. అలాగే పొగాకు కంపెనీలన్నీ తప్పనిసరిగా కొనుగోళ్లు చేపట్టాలని.. ఏ ఒక్క కంపెనీ కూడా వెనక్కు వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. టొబాకో బోర్డ్ పరిధిలో కాకుండా... అనధికారికంగా కొనుగోళ్లు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని... అవసరమైతే అరెస్టులు చేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. తనకు రైతుల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి... ఈ ఏడాది పొగాకు ట్రేడర్లు, కంపెనీలు ప్రభుత్వానికి, రైతులకు సహకరించాలని కోరారు. రాబోయే ఏడాది నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ...మిగతా 2లో

## ఇద్దరి చావుకు కృష్ణలంక సీఐ కారణం



అయినా కేసు పెట్టకుండా కేవలం సస్పెన్షన్

ఈ కేసులో సీఐనే బాధ్యుడిని చేయడం సరికాదు

నేరంలో విజయవాడ సీపీ, డీజీపీకి భాగం

అందరిపైనా మర్డర్ కేసు పెట్టి శిక్షించాలి: తేల్చి చెప్పిన వైయస్ జగన్

## రైతు కష్టాన్ని అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు



రాష్ట్ర ఆర్థిక సవాళ్లు ఉన్నా రైతు సంక్షేమంలో రాజీ లేదు

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, జూన్ 18: రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ చూపారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు ...మిగతా 2లో

## రెండేళ్లలో గృహ నిర్మాణ రంగానికి నూతన ఊపిరి

'4.50 లక్షల ఇళ్ల పూర్తి - మరో 4 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో

'పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి



(అమరావతి,పి.మీరాహుస్సేన్ ఖాన్,మనం ప్రత్యేక ప్రతినిధి): రెండేళ్లలో గృహ నిర్మాణ రంగానికి నూతన ఊపిరి లభించిందని, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించగా, మరో 4 లక్షల గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం గృహ నిర్మాణ రంగానికి ...మిగతా 2లో



## ఆక్వా ఫీడ్ ధరపై సీఎం సమావేశం

### ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు కంపెనీల అంగీకారం

ఆక్వా ఫీడ్ ధరల స్థిరీకరణపై కమిటీ ఏర్పాటు

ఫీడ్ ధర తగ్గింపు, విద్యుత్ రాయితీపై సీఎంకు రైతుల ధన్యవాదాలు

గత ప్రభుత్వంలో ఆరు సార్లు ఫీడ్ ధర పెంచినా పట్టించుకోలేదన్న రైతులు

(అమరావతి,పి.మీరాహుస్సేన్. మనం ప్రత్యేక ప్రతినిధి): ఆక్వా ఫీడ్ ధరల పెంపుతో గత కొన్ని రోజులుగా తలెత్తిన సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కారం చూపించారు. అటు ఆక్వా రైతులపై అధిక భారం పడకుండా, ఇటు ఫీడ్ తయారీదారులు నష్టపోకుండా ప్రస్తుత ధరపై రూ.4 తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనికి ఫీడ్ తయారీదారులు, ఆక్వా రైతులు అంగీకరించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్పీ రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. దీనిపై చేపలు, రొయ్యల సాగు రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో గురువారం ఉన్నతాధికారులు, ఆక్వారైతులు, ఫీడ్ తయారీదారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ధర తగ్గించడంతో పాటు... ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారు. ఫీడ్ ధరలతో పాటు, ప్రాసెసింగ్ విధానం, కాలుష్య నియంత్రణ పైనా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ...మిగతా 2లో

## కపిలతీర్థంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు

టిటిడి జేఈవో డా. ఎ.శరత్



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధిః కపిలతీర్థంలోని శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి జేఈవో డా. ఎ. శరత్ గురువారం సాయంత్రం ఆలయాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్నందున ఆలయానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లను ...మిగతా 2లో

## నాడు విధ్వంస పాలన... నేడు సుపరిపాలన

మంత్రి కందుల దుర్గేష్



గుంటూరు,అమరావతి,జూన్,17,(మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): అక్రమ అరెస్టులు, నిరంకుశత్వాల చీకటి రోజులు ముగిశాయని, పారదర్శక పాలనకు రెండేళ్లు నిండాయని గుంటూరు జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరులోని సత్య సాయి నగర్ గ్రౌండ్స్లో ...మిగతా 2లో

## రెండేళ్ల కూటమిపాలనకు ప్రజలు బ్రహ్మారథం



అభివృద్ధి, సంక్షేమానికి సమాంతరంగా అధిక ప్రాధాన్యత...

గొడ్డల పార్టీ విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

పాలకొల్లులో కూటమి రెండేళ్ల నమ్మకం సభలో మంత్రులు శ్రీనివాస్ వర్మ, రామానాయుడు

పాలకొల్లు, జూన్ 18,మనం ప్రతినిధి: అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యమిచ్చి కూటమి ప్రభుత్వం దూసుకు పోతోందని... అందుకు మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లా కలయిక వల్లే సాధ్యపడిందని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు లు అన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంతో పాటు గొడ్డలి పార్టీ అబద్ధాలు ...మిగతా 2లో

## మోదీ ప్రభుత్వ పుష్కర కాలంలో దేశ పురోభివృద్ధి

ఏపీకి కేంద్రం భారీ నిధులు.

బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి వెల్లడి.



మార్కాపురం.జూన్,18,(మనం న్యూస్): కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం పుష్కర కాలంలో దేశం ఎంతో పురోభివృద్ధి సాధించిందని, అలాగే ఏపికి కేంద్రం భారీ స్థాయిలో నిధులు మంజూరు చేస్తుందని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి అన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన విజయాలపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పివి కృష్ణారావు తో కలిసి ఆయన గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి మరియు రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ...మిగతా 2లో

## కోటి దాటిన యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు

13 జిల్లాల్లో వంద శాతం దాటిన రిజిస్ట్రేషన్లు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్యాదవ్ వెల్లడి.

అమరావతి,జూన్,18,(మనం ప్రత్యేక ప్రతినిధి): యోగాంధ్ర-2026 రిజిస్ట్రేషన్ల లక్ష్యంలో 96.82% వృద్ధి నమోదైంది. 1,04,93,947 లక్ష్యం కాగా గురువారం సాయంత్రం నాటికి ...మిగతా 2లో

## డీప్ టెక్ స్టార్టప్‌ల కోసం ఏపీలో తొలి క్వాంటం ఇంక్యుబేటర్

రేపు మేధా టవర్స్‌లో ఈ ఇంక్యుబేటర్ ప్రారంభించనున్న చండీగఢ్ యూనివర్సిటీ

(అమరావతి,పి.మీరాహుస్సేన్ జూన్ 18,మనం ప్రత్యేక ప్రతినిధి): ఏపీని అంతర్జాతీయ స్థాయి క్వాంటం డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ గా మార్చటమే లక్ష్యంగా మరో కీలకమైన ముందడుగు పడింది. డీప్ టెక్ స్టార్టప్ లకు సహకారం అందించేలా మొట్టమొదటి ...మిగతా 2లో

## మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ

డీఎస్సీలో అడుగడుగునా అక్రమాలే

మేం ప్రశ్నించాకే సెలక్షన్ లిస్ట్ ఇచ్చారు

జీవోలు మార్చి స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు

బొత్స సత్యనారాయణ ఆక్షేపణ

(విజయవాడ,జూన్ ,18,మనం ప్రతినిధి.): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న దుశ్చర్యలపై గవర్నర్ కు ఫిర్యాదు చేశాం. ముఖ్యంగా మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు ...మిగతా 2లో

## మళ్లీ బంగాళాఖాతం జలాల్లోకి పాక్ సబ్‌మెరైన్‌లు..!



ఢిల్లీ, జూన్ 18: 1971 ఇండియా-పాక్ వార్.. బంగ్లాదేశ్ విముక్తి కోసం జరిగిన ఈ యుద్ధంలో భారత నౌకాదళ సామర్థ్యాన్ని దాయాది కళ్లారా చూసింది. ఆ దెబ్బతో పాక్ మరోసారి బంగాళాఖాతంలోకి అడుగుపెట్టే సాహసం చేయలేదు. అలాంటిది ఇన్నేళ్ల తర్వాత మన శత్రుదేశం కన్ను మళ్లీ ఈ జలాలపై పడింది. బంగాళాఖాతంలో జలాంతర్గాములను ...మిగతా 2లో

# ఆక్వా ఫీడ్ ధరపై సీఎం సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ఫీడ్ ధరలు ఆరుసార్లు పెంచారని, అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై ఎటువంటి చొరవ తీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆక్వా రైతులు ఈ సందర్భంగా తెలిపారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆ ధర రూ.107.80కి చేరిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందన్నారు.

తామెప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదని, ఇటీవల కొందరు ఆక్వా రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంతో అన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వాసాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని రైతులు గుర్తు చేశారు.

**సమస్యలు విన్నవించిన రైతులు**

ప్రస్తుతం ఆక్వాసాగులో ఎదురవుతోన్న సమస్యలను ముఖ్యమంత్రితో సమావేశంలో ఆక్వా రైతులు వెల్లడించారు. సాగుకు వినియోగించే అన్ని వస్తువుల ధరలు పెరిగాయని... కానీ ఆక్వా ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగడం లేదన్నారు. ముడిసరుకు ధర పెరిగినప్పుడు ఫీడ్ ధర పెంచుతున్నారు కానీ, ముడిసరుకు ధర తగ్గినప్పుడు మాత్రం ఫీడ్ ధర తగ్గించడం లేదన్నారు. దీనికితోడు ప్రాసెసింగ్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మత్స్యశాఖ నుంచి రైతులకు అందించే రాయితీలపైనా అందరికీ అవగాహన కల్పించాలని రైతులు కోరారు. రాయితీలకు సంబంధించి నిర్దేశించిన ఎంప్యానెల్ విషయంలో మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రొయ్యల చెరువులకు బీమా సౌకర్యాన్ని విస్తృత పరిచేలా చూడటంతో పాటు, నర్సరీ పాండ్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలన్నారు. అలాగే చేపలు, రొయ్యల చెరువులకు నీటి వనరులు అందించాలని రైతులు చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే పొగాకు మార్కెట్ స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తుందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. రైతులు, టొబాకో బోర్డు ప్రతినిధులను వెంట పెట్టుకుని ఢిల్లీ వెళ్లి సంబంధిత మంత్రులు, అధికారులను కలవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రాం నారాయణ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, డీవీబీ స్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, టొబాకో బోర్డ్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో కృష్ణా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమంలో విశేష పురోగతి

**మచిలీపట్నం: జూన్ 18,(మనం న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో కృష్ణా జిల్లా అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, సంక్షేమం-అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తూ రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, వైద్య బీమా సేవల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 1.33 లక్షల రైతు కుటుంబాలకు రూ.252.94 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు తెలిపారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించేందుకు 29 కిసాన్ డ్రోన్లను సబ్సిడీపై అందించామని, ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఉద్యానవన రంగంలో వేలాది మంది రైతులకు సబ్సిడీలు అందించడంతో పాటు పామాయిల్ రైతుల పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు వెల్లడించారు. డ్రాగన్ ఫ్రూట్, మష్రూమ్, పైన్ ఆపిల్ వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం: మంత్రి కొల్లు రవీంద్ర

కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు.

ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పెన్షన్ల పంపిణీ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

## కపిలతీర్థంలో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు

(మొదటి పేజీ తరువాయి)

మరింత పటిష్టంగా తీర్చిదిద్దడం, డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులు చేపట్టడం, పరిశుభ్రతను మెరుగుపరచడం వంటి అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేసి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఈవో బి. నాగరత్న, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి గిరిధర్, డీఈలు రవిశంకర్ రెడ్డి, సరస్వతి, ఈఈలు మల్లికార్జున ప్రసాద్, సుమతి, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డా. సునీల్ ప్రసాద్, సూపరింటెండెంట్ కె.పి. చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రైతు కష్టాన్ని అర్థం చేసుకున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం సీఎం క్యాంపు కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడిన ఆయన, ఆక్వా ఫీడ్ ధరలు, వర్జీనియా పొగాకు కొనుగోళ్లు, తోతాపురి మామిడి రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో విస్తృత సమీక్ష నిర్వహించి రైతులకు మేలు చేసే కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ పరిస్థితులు, ముడి సరుకుల ధరల పెరుగుదల కారణంగా ఫీడ్ కంపెనీలు ధరలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపినా, రైతులపై భారం పడకూడదన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు జోక్యం చేసుకున్నారని చెప్పారు. ఫీడ్ ధరలను ఏకపక్షంగా పెంచడానికి ప్రభుత్వం అనుమతించలేదని, రైతులు, కంపెనీల మధ్య సమన్వయం ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయానికి రావాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరస్పర అంగీకారంతో పరిమిత స్థాయిలో ధరల సవరణకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్పీ రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని, 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్లు మంత్రి తెలిపారు.

## నాడు విధ్వంస పాలన... నేడు సుపరిపాలన

(మొదటి పేజీ తరువాయి)

'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం' నినాదంతో భారీ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జరుగుతున్న విజయోత్సవాల్లో భాగంగా గుంటూరులో ఈ సభను ఏర్పాటు చేశామని, జిల్లా యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మను మంత్రి దుర్గేష్ అభినందించారు. ఈ వేదికపైకి తాము రావడానికి కారకులైన కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులకు, ప్రజాప్రతినిధులకు, ఎంపీలకు, ఎమ్మెల్సీలకు మరియు అహోరాత్రులు శ్రమించిన కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..గత 2019-24 నాటి రాక్షస పాలనకు స్వస్తి పలికి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. దేశంలోనే అత్యంత సమర్థవంతమైన, దార్శనిక నేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షత, పేదవాడి కళ్లల్లో ఆనందం చూడాలని, కూటమి ఏర్పాటుకు వెన్నెముకగా నిలిచిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్యాగం, రాష్ట్ర సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో..రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' ప్రజా జీవితాల్లో వెలుగులు నింపుతోందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపు, దీపం-2 పథకం, తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి విప్లవాత్మక కార్యక్రమాలతో మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూశామని, సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం సజావుగా అమలు చేయడంతో ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందన్నారు.

## మోదీ ప్రభుత్వ పుష్కర కాలంలో దేశ పురోభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.23,500 కోట్లు కేటాయించిందని తెలిపారు. అలాగే వెనుకబడిన మార్కాపురం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి జల జీవన్ మిషన్ ద్వారా రూ.1,290 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో స్టేట్ హైవేలను, నేషనల్ హైవేలతో అనుసంధానం చేస్తూ రవాణా సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించి హార్టికల్చర్ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కేంద్ర పథకాలు ప్రతి పౌరుడికి చేరేలా పార్టీ కృషి చేస్తుందని తెలిపారు.

## ఇద్దరి చావుకు కృష్ణలంక సీఐ కారణం

**(విజయవాడ,మనం బ్యూరో):** విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్లో లాకప్డెత్కు గురైన సాయికృష్ణ కేసులో సీబీఐ దర్యాప్తు జరగాలని, అందుకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కేసులో విజయవాడ కమిషనర్తో పాటు, రాష్ట్ర డీజీపీకి కూడా ప్రమేయం ఉందని ఆయన వెల్లడించారు. కేవలం కంటి తుడుపుగా సీఐని సస్పెండ్ చేశారన్న వైయస్ జగన్, విజయవాడ సీపీ, డీజీపీతో సహా, అందరిపై మర్డర్ కేసు పెట్టి శిక్షించాలని తేల్చి చెప్పారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్లో లాకప్డెత్కు గురైన గాదె సాయికృష్ణ తల్లి, కుటుంబ సభ్యులను మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి పరామర్శించారు. కృష్ణలంకలో ఉంటున్న వారి ఇంటికి వెళ్లి మాట్లాడిన వైయస్ జగన్ ఓదార్చారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ మాట్లాడుతూ

**ప్రతి ఒక్కరూ ఆలోచించాలి:**

విజయవాడ నడిబొడ్డున, అంటే రాష్ట్రానికి రాజధాని ప్రాంతం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే ముఖ్యమంత్రి గారి నివాసం. ఇక్కడి నుంచి కూతవేటు దూరం లోనే డీజీపీ కార్యాలయం. విజయవాడలోనే కమిషనరేట్ కూడా ఉంది. ఇక్కడే ఏసీపీప రిధి. ఇదే పరిధిలోనే ఈ పోలీసు స్టేషన్ ఉంది. ఇదే పోలీసు స్టేషన్ పరిధిలోనే నా పక్కనే ఉన్న ఈ తల్లి ఎంత దారుణంగా ఈ ఘటన జరిగిందో చెప్తూ రోదిస్తున్న దృశ్యం. ప్రతీ ఒక్కరినీ ఒకటో ఆలోచన చేయమని అడుగుతున్నా. 'పోలీసులు చెబుతున్నట్లు నా కొడుకు దోపిడీలు, దొంగతనాలు చేసి కోట్లు గడిస్తే, ఒక గిగ్ వర్కర్గా ఎందుకు పని చేస్తాడు బాబూ' అని ఆ తల్లి తన గోడు వెళ్లబోసుకుంది. ఆ కుటుంబం పరిస్థితి అంత దారుణంగా ఉంది. చంద్రబాబునాయుడు దగ్గరుండి ప్రోత్సహిస్తున్న కొంతమంది పోలీసులు, వీరు చేసే పనుల వల్ల ఈ రాష్ట్రంలో ఏదైనా అన్యాయం జరిగితే పోలీసు స్టేషన్కు పోవడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. అలా ఈ రాష్ట్రంలో పరిపాలన సాగుతోంది. ఇదే పోలీసు స్టేషన్ కమిషనరేట్, ఏసీపీ కార్యాలయం పరిధిలో ఉన్నాయి. అందరూ కూడబలుక్కుని ఒకరినొకరు ఎలా వెనకేసుకువస్తున్నారని చెప్పడానికి నిదర్శనం ఇది.

**మే నెలలోనే రెండు ఘటనలు:**

మే మాసంలో ఒక ఘటన కాదు. సాయికృష్ణది ఓ ఘటన అయితే క్రాంతికుమార్ అనే మరో పిల్లాడిది ఇంకో ఘటన. అది ఆత్మహత్య ఘటన. పలానా సీఐ, పలానా పోలీసు స్టేషన్ పరిధి. రోజూ నన్ను కొడుతున్నాడు, నేను తట్టుకోలేకపోతున్నాను. నా చావుకు కారణం ఆ సీఐ అని మరణ వాంగ్మూలం ఇస్తూ తాను ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి. మే 9న సాయికృష్ణ ఘటన కూడా జరిగింది.

## మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

ఆశలు కల్పించి పూర్తిగా దగా చేశారని గవర్నర్ కి చెప్పాం. విపక్షం కానీ ప్రజలు కానీ ఆధారాలతో సహా ఏదైనా విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు సందేహాల్ని నివృతి చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలా జరగలేదు. ముందుగానే ప్రభుత్వం తాము అనుకున్న వ్యక్తులతో లాలూచీ పడి డీఎస్సీ ప్రశ్నాపత్రం సెట్ చేసిన దగ్గరి నుంచి ఉద్యోగాలు ఇచ్చే వరకూ, స్పోర్ట్స్ కోటాతో కలిపి అక్రమాలకు పాల్పడింది. దీనిపై ఐదు అంశాలతో గవర్నర్ కి ఫిర్యాదు చేశాం. ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావం తర్వాత డీఎస్సీ నిర్వహించినప్పుడు ఎంపికైన అభ్యర్థుల జాబితాల్ని కలెక్టర్ కార్యాలయాల్లో పెట్టేవారు. ఆ తర్వాత ఇంటర్వ్యూలకు పిలిచేవారు. కానీ ఇప్పుడు ఆ లిస్ట్ ఎక్కడుంది. సమస్యపై మేం ప్రశ్నించిన తర్వాత అన్నీ సర్దుకుని సెలక్షన్ లిస్ట్ వెబ్ సైట్ లో పెట్టారు. దీనిపై నేనే స్వయంగా నలుగురు డీఈవోలతో మాట్లాడాను. కానీ వారి దగ్గర లిస్టు దొరకలేదు.

మేం ప్రశ్నించడం మొదలుపెట్టాక వెబ్ సైట్లో పెట్టారు. అంటే ఇక్కడ ఏదో జరిగింది. ప్రభుత్వ పెద్దలు ఇందులో జోక్యం చేసుకున్నారు. అక్రమాలపై ఫోన్ కాల్స్ బయటికి వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం అయినా విచారణ జరిపి కేసులు పెడుతుంది. కానీ ఇక్కడ ఏ చర్యలూ తీసుకోలేదు.

నేను, ఆదిమూలపు సురేశ్ కూడా విద్యాశాఖ మంత్రులుగా పనిచేసాం. పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగితే వెంటనే బాధ్యుల్ని అరెస్టు చేసి జైళ్లకు పంపాం. కానీ ఇక్కడ మాత్రం అక్రమాలను ఏమాత్రం పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో స్పోర్ట్స్ కోటా జీవోలు ఉంటే వాటిని మార్చి జీవోలు ఇచ్చారు. డీఎస్సీ పరీక్ష పూర్తయ్యాక మళ్లీ అవే జీవోల్ని మార్చేశారు. స్పోర్ట్స్ కోటాలో బ్రిడ్జ్ ఆట కూడా గేమ్ అని ఉద్యోగాలు ఇచ్చేశారు. కానీ ఇప్పుడు నిస్సిగ్గుగా పాత ప్రభుత్వం ఇచ్చిందని చెప్తున్నారు. మా ప్రభుత్వంలో ఇస్తే జీవో చూపించమని కోరుతున్నాం.

## రెండేళ్ల కూటమి పాలనకు ప్రజలు బ్రహ్మరథం

(మొదటి పేజీ తరువాయి)



అసత్యాలతో విష ప్రచారాన్ని కూటమి శ్రేణులు తిప్పి కొట్టాలని పిలుపుని చ్చారు. పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రామచంద్ర గార్డెన్స్ లో గురువారం ప్రధానిగా మోడీ 12 ఏళ్లు పూర్తి, కూటమి ప్రభుత్వ రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం సందర్భం గా జరిగిన సభలో పాల్గొని మాట్లాడారు. కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు జేజేలు పలుకుతున్నారని, దీనిని గొడ్డల పార్టీ ఓర్వలేకపోతుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పనితీరును వివరిస్తూ చంద్రబాబు పవన్ కళ్యాణ్ లకు మోడీ ఉండడమే కారణం అన్నారు. మంత్రి రామానాయుడు గురించి మాట్లాడుతూ రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తున్నారని, ఎక్కడెక్కడ నిధులు ఉన్నాయో కనిపెట్టి తీసుకువచ్చే ఘనుడని ప్రసంశించారు. నిత్యం ప్రజలతో మమేకమ వుతూ పనిచేసే ఎమ్మెల్యేల్లో మంత్రి రామానాయుడు మొదటి ఉంటారన్నారు. సభకు అధ్యక్షత వహించిన మంత్రి నిమ్మల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనకు అన్ని వర్గాల ప్రజలు పూర్తి సంతృప్తి చెందారని, బ్రహ్మరథం పడుతున్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయన్నారు. కాగా గొడ్డలి పార్టీ, ఆ పార్టీ అధినేత జగన్ కుట్రలు కుతంత్రాలతో అభివృద్ధికి అడ్డు తగులుతున్నాడు అన్నారు. ఝుగా సమాంతరంగా పాలన అందిస్తున్నామన్నారు. ఇటీవల వెన్నుపోటు అనే కార్యక్రమాన్ని నిర్వహించారని, మన ప్రభుత్వంలో అమలు చేస్తున్న వృద్ధులు, వితంతువులకు నువ్వు 2000 నుంచి 3000 పెన్షన్ పెంపు, రంగులకు 3000 నుంచి 6000 పెంపు, కుటుంబంలో ఎంతమం ది పిల్లలు ఉంటే అందరికీ 15000 చొప్పున తల్లికి వందనం పథకం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, డీఎస్సీ ద్వారా 16,350 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ, అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20,000, ఆటో డ్రైవర్ల సేవలో 15000, రద్దు చేసిన అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి అనేక పథకాలు అమలు చేయడం వెన్నుపోటా అంటూ ప్రజలే ప్రశ్నిస్తు న్నారని మంత్రి రామానాయుడు తెలిపారు.

## కోటి దాటిన యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

1,01,60,652 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 28కి 13 జిల్లాల్లో నూరు శాతానికి మించి రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఓ ప్రకటన జారీచేశారు. దీనికిముందు సచివాలయంలో ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఈ నెల 21న నిర్వహించనున్న యోగాసన కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష జరిపారు అధికారులు ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి మంత్రికి నివేదించారు

**2 రోజుల ముందుగానే..**

అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాలను ప్రతిష్టాకరంగా తీసుకుని ఈ నెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 21న రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జరిగే యోగాసన కార్యక్రమాల్లో 1,04,93,947 మందిని భాగస్వాములను చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాల్లోని జనభా ప్రాతిపదికన లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనికి అనుగుణంగా యోగాంధ్ర పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. రిజిస్ట్రేషన్ల నమోదులో జిల్లాల అధికారులు ప్రత్యేక శ్రద్ధకనబరిచారు. రాష్ట్ర స్థాయిలో మంగళగిరిలోని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పడిన వార్ రూం ద్వారా నిత్యం పర్యవేక్షణ కొనసాగుతోంది. ఈ నెల 20వ తేదీనాటికి రిజిస్ట్రేషన్లు ముగియాల్సి ఉంది. అయితే గురువారం నాటికే 1,01,60,652 రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం.

## రెండేళ్లలో గృహ నిర్మాణ రంగానికి నూతన ఊపిరి

(మొదటి పేజీ తరువాయి)

అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా ముందుకు సాగుతోందన్నారు. పేదల గృహ భద్రత, సామాజిక స్థిరత్వం, జీవన ప్రమాణాల మెరుగుదల ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం ప్రచారం విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గృహ నిర్మాణ రంగంలో సాధించిన ప్రగతి, అమలులో ఉన్న కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ సమగ్ర వివరాలు వెల్లడించారు. సొంత ఇల్లు అనేది ప్రతి కుటుంబం కల మాత్రమే కాకుండా ఆర్థిక భద్రతకు, సామాజిక గౌరవానికి, కుటుంబ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని అన్నారు. గతంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు, కొత్తగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోంద న్నారు.

**2014-2019లో చారిత్రాత్మక గృహ నిర్మాణ కార్యక్రమం**

2014-19 కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ రంగాన్ని పేదల సంక్షేమ కార్యక్రమాల్లో అత్యున్నత ప్రాధాన్యత కలిగిన అంశంగా పరిగణించి, ప్రతి అర్హత గల కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో విస్తృత స్థాయిలో గృహ నిర్మాణ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గృహ నిర్మాణ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వ సహాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా గణనీయమైన ఆర్థిక వనరులను సమకూర్చి పేదలకు నాణ్యమైన గృహాలను అందించే దిశగా చర్యలు చేపట్టిందన్నారు.

## డీప్ టెక్ స్టార్టప్‌ల కోసం ఏపీలో తొలి క్వాంటం ఇంక్యుబేటర్

(మొదటి పేజీ తరువాయి)

క్వాంటం ఇంక్యుబేటర్ ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభం కానుంది. చండీగఢ్ యూనివర్సిటీ తొలి క్వాంటం ఇంక్యుబేటర్ ను ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 19 తేదీన గన్నవరంలోని మేధా టవర్స్ లో ఈ ఇంక్యుబేటర్ ను ప్రారంభించనున్నారు. ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, అమరావతి క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఆర్టీఐహెచ్ సీఈఓ ధాత్రీ రెడ్డి, చండీగఢ్ యూనివర్సిటీ ప్రతినిధులు ఈ ఇంక్యుబేటర్ ను ప్రారంభించనున్నారు. క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్ డ్ సెమీకండక్టర్లు, రోబోటిక్స్, స్పేస్ టెక్నాలజీ లాంటి ఇతర కీలకమైన సాంకేతికతలపై పనిచేసే స్టార్టప్ లకు ప్రధాన వేదికగా క్వాంటం ఇంక్యుబేటర్ ను ఏర్పాటు చేస్తున్నారు. డీప్ టెక్ స్టార్టప్ సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు, ఆవిష్కరణలు చేసేందుకు వీలుగా ఈ ఎకోసిస్టమ్ పనిచేయనుంది. మెంటార్షిప్, పరిశోధనా సహకారం, ఇన్వెస్టర్ నెట్వర్క్ , ఇంక్యుబేషన్ కు సంబంధించిన మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు సంబంధించిన తదితర అంశాల్లో ఓ ఎకోసిస్టమ్ తయారయ్యేందుకు వీలుగా స్టార్టప్ లకు ఈ క్వాంటం ఇంక్యుబేటర్ సహకారాన్ని అందించనుంది. డీప్ టెక్ స్టార్టప్ లకు అవసరమైన మార్కెట్ లింకేజ్ కూడా కల్పించేలా ఈ కేంద్రం పని చేయనుంది. తాత్కాలికంగా గన్నవరంలోని మేధా టవర్స్ నుంచి ఈ క్వాంటం ఇంక్యుబేటర్ పనిచేయనుంది. డీప్ టెక్ ఆవిష్కరణలతో పాటు పెట్టుబడులు, ఎక్కువ వేతన శ్రేణి ఉద్యోగాల కల్పన క్వాంటం ఇంక్యుబేటర్ ద్వారా సాకారం కానున్నాయి.

## ఎరుపు రంగు చెవులతో అరుదైన ఏనుగు



**డెహ్రాడూన్, జూన్ 18:** ఉత్తరాఖండ్‌లోని కార్బెట్ టైగర్ రిజర్వ్లో అరుదైన మగ ఏనుగు పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఎరుపు రంగు చెవులను కలిగి ఉండటంతో అది 'రెడ్ ఇయర్స్'గా ప్రసిద్ధి చెందింది. టైగర్ రిజర్వ్‌లోని దిఖాలా, జిర్నా జోన్లలో ఈ అరుదైన గజరాజు ఇటీవల సందర్శకులకు దర్శనమిచ్చింది. చర్మంలో ఆ భాగంలో రక్తనాళాలు కనిపించడం వల్ల వీటికి సహజంగా ఎరుపు రంగు వస్తుందని వన్యప్రాణి నిపుణులు చెబుతున్నారు.

## మళ్లీ బంగాళాఖాతం జలాల్లోకి పాక్ సబ్‌మెరైన్‌లు..!

(మొదటి పేజీ తరువాయి)

మోహరించే ఆలోచన చేస్తోంది. పాక్ నేవీకి చెందిన సీనియర్ అధికారి వ్యాఖ్యలతో ఈ విషయం బయటపడింది. పాకిస్థాన్ తమ నౌకాదళంలోకి కొత్తగా హంగోర్ శ్రేణి జలాంతర్గాములను చేర్చుకునే ప్రణాళికలను వేగవంతం చేసింది. చైనా నుంచి 8 హంగోర్ శ్రేణి సబ్‌మెరైన్‌ల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో ఒకటి ఇటీవల చైనా నుంచి పాక్ చేతికి వచ్చింది. దానికి ఎస్కార్ట్‌గా ఉన్న ఫ్లోటిల్లా నౌక కమాండర్ కమోడోర్ ఒమర్ ఫరూఖీ మార్గమధ్యలో శ్రీలంకలో ఆగారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ.. ''హంగోర్ శ్రేణి జలాంతర్గాములతో మా దేశ నౌకాదళ సామర్థ్యం అరేబియా సముద్రాన్ని దాటి విస్తరించనుంది. వీటితో మేం బంగాళాఖాతంలోనూ మా సైనికశక్తిని మోహరించే అవకాశం దక్కుతుంది. ఇవి గేమ్ఛేంజర్ సబ్మెరైన్లు'' అని వ్యాఖ్యానించారు. దీంతో ఈ హంగోర్ జలాంతర్గాములను పాక్ బంగాళాఖాతంలో మోహరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బంగాళాఖాతం ఏ దేశానికి ప్రాదేశిక సముద్రం కాదు. భారత్‌తో పాటు బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌లాండ్, మలేసియా, ఇండోనేసియా, శ్రీలంక తీర దేశాలుగా ఉన్నాయి. తీర ప్రాంతం నుంచి సముద్రం లోపలికి 12 నాటికల్ మైళ్ల వరకు ప్రాదేశిక జలాలుగా గుర్తిస్తారు. 200 నాటికల్ మైళ్ల వరకు ఎక్స్క్లూజివ్ ఎకనామిక్ జోన్ ఉంటుంది. ఆ సరిహద్దులు దాటితే అంతర్జాతీయ జలాలే. అక్కడ ఏ దేశ సైనిక నౌకలైనా స్వేచ్ఛగా సంచరించవచ్చు. భారత్కు ఇది వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం. తూర్పు నావెల్ కమాండ్ ఇక్కడే ఉంటుంది. మన దేశ అణు జలాంతర్గాములు విశాఖ కేంద్రంగానే రూపొందుతాయి. అంతేకాదు.. మన జలాంతర్గాములను నిలిపి ఉంచే 'ఐఎన్ఎస్ వర్ష' కూడా ఇక్కడే ఉంది. గతంలో విశాఖలో పాక్ గూఢచారులను అరెస్ట్ చేసిన ఘటనలూ ఉన్నాయి. ఇటీవలి కాలంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ మైత్రి బలపడుతోంది. ఇలాంటి సమయంలో బంగాళాఖాతంపై పాక్ ఆశలు బయటపడటం ప్రాధాన్యం సంతరించుకుంది. 1971 యుద్ధం తర్వాత ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు తెగిపోయిన సంగతి తెలిసిందే. అయితే, 2024లో బంగ్లాలో షేక్ హసీనా సర్కారు కుప్పకూలిన తర్వాత.. పాక్ ఆ దేశానికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తోంది. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు మొదలవడం, ద్వైపాక్షిక వాణిజ్యం పెరగడం, సైనిక సహకారం బలోపేతం చేసుకోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. కరాచీ, ఛట్టోగ్రామ్ మధ్య తొలిసారి నేరుగా సముద్రమార్గంలో వాణిజ్యం కూడా మొదలైంది. ఇక, గతేడాది నవంబరులో పాక్ యుద్ధ నౌక పీఎన్ఎస్ సైఫ్ నాలుగురోజుల పాటు ఛట్టోగ్రామ్ తీరంలో మోహరించడం గమనార్హం. ఈ జలాంతర్గామిని చైనా అభివృద్ధి చేసింది. ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ టెక్నాలజీతో దీన్ని రూపొందించారు. సాధారణ డీజిల్-ఎలక్ట్రికల్ సబ్‌మెరైన్లతో పోలిస్తే ఇది సుదీర్ఘకాలం పాటు నీటి లోపల ఉండగలదు.

## పొగాకు రైతుల ప్రయోజనాలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్. విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రకాశం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని మంత్రి గొట్టిపాటి చెప్పారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. పొగాకు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే వేలం వేదికల ద్వారానే కొనుగోళ్లు జరగాలని, అనధికార లావాదేవీలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు పండించిన పంటకు సరైన విలువ దక్కేలా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేపడుతుందని చెప్పారు. ఉత్పత్తి పెరిగిందనే కారణంతో రైతులకు నష్టం కలిగించే నిర్ణయాలను అనుమతించబోమని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేసిందన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన పొగాకును తిరస్కరించడం వల్ల రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి పరిస్థితులు లేకుండా కనీస మద్దతు ధరగా రూ. 200 తగ్గకుండా కంపెనీలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు చెప్పారు. గత ఏడాది మార్కెట్లో లభించిన ప్రోత్సాహకర ధరల కారణంగా ఈసారి సాగు విస్తీర్ణం పెరిగిందని, సిగిరెట్ వంటి వాటిపై ట్యాక్సులు పెరిగాయనే కారణాలు చెప్పి పొగాకును తిరస్కరించరాదని మంత్రి స్పష్టం చేశారు. పండించిన పంటకు మార్కెట్ కల్పించే బాధ్యతను సంబంధిత సంస్థలు నిర్వర్తించాల్సిందేనని పేర్కొన్నారని తెలిపారు. భవిష్యత్తులో ఉత్పత్తి, డిమాండ్, కొనుగోలు సామర్థ్యం వంటి అంశాలను ముందుగానే సమీక్షించి పంట ప్రణాళిక రూపొందించే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. రైతులు, పొగాకు కంపెనీలు, బోర్డు అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

మనం Manam Editorial సంపాదకీయం

## భువినొదిలిన క్షణం

గుక్కపట్టిన కన్నపేగు
కుప్పకూలిన నినుగన్నవారు
ఆశ్చర్యంలో బంధువర్గం
ఎలా ? ఎందుకు ? ఎప్పుడు ?
ప్రశ్నల వర్షంలో నీ పరివారం
వాట్స్ అప్ స్టేటస్లో నీ నేస్తాల
ప్రేమ సుగంధపు వెల్లువలు

అప్పటివరకు ఇన్ని బంధాల
చిక్కుముడుల్లో వున్న నువ్వు
నిద్రావస్థలో లీనమైపోతావ్
నీ చుట్టూ వున్నా నలుగురు
నిన్ను బాడీ బాడీ అని సంబోధిస్తూ
నడిరోడ్డుమీదకి తీసుకొస్తారు
కన్నీటితో కొందరు, మౌనంతో కొందరు,
బాధను వెళ్లగక్కుతూ వుంటారు

వీదంతా జనసందోహంతో నిండిపోతుంది
ఎలా భువినొదిలావో తెలియక
ప్రవచనకర్తల్లా గుంపుగా కూర్చొని
ప్రసంగాలు అల్లుకుపోతూ వుంటారు
తెలిసి కొందరు చెబుతుంటే
తెలియకకొందరు వెకిలిగా, వెటకారంగా
పదబంధనాల్లో ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంటారు

తదుపరి నిన్ను పూలవర్షంతో గర్వంగా
నలుగురు మోస్తూ తీసుకెళ్తూ ఉంటే
నిన్నటివరకు నిన్ను పలకరిస్తూ నవ్విన ఆమె
తలుపు టక్కున వేసుకుంటుంది
ఎందుకంటే నువ్విప్పుడు శవం
నీపై చల్లిన పూరేకులు అమంగళమైనవి
మీ ఇంటికొస్తే ఆమెకు అంటు మరి

సాహితీకర్తలైతే చక్కని పదాలతో
భావకవితలల్లుతూ విశ్లేషిస్తూ ఫేసుబుక్స్ లో
పోస్ట్స్ పెడుతూ వుంటారు
మీ వీధి చివరలో నీ ఫోటో గాలికి
అటు ఇటు ఊగుతూ వెళ్లేపోయే వారికి
నిన్ను గుర్తు చేస్తూ ఉంటుంది.
నువ్వు భువినొదిలిన క్షణం నిదానంగా
మరుగున పడిపోతుంది
గోడమీద జ్ఞాపకంలా
మదిలో నిన్ను చెరగని ముద్రగా
లిఖించుకున్నవారు మాత్రం
తలుస్తూ కుమిలిపోతూ
జన జీవన స్రవంతిలో
కలవలేక, కలిసినట్టు
నటిస్తూ బ్రతికేస్తుంటారు

**- వాసి జ్యోత్స్న**
9866843005

## రుబా

రాతిరి ఒంటరి
మనసు తుంటరి
ఏది జంటమరి
ఓ తారక మిటారి
నీతులు వినిపించవు
దృశ్యాలు కనిపించవు
పెదాల నిశ్శబ్ద దరువు
మనసుకు పెద్ద బరువు

**- రేడియమ్**
9291527757

# ఎల్‌నినో నీడలో దేశీయ వ్యవసాయం

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు, కోట్ల మంది ప్రజల జీవనాధారానికి వ్యవసాయ రంగమే వెన్నెముక అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, దేశీయ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా రుతుపవనాల జూదంగానే సాగుతోంది. దేశం మొత్తం మీద ఏడాది పొడవునా కురిసే వార్షిక వర్షపాతంలో సింహభాగం, అనగా దాదాపు 75 శాతం వర్షపాతం జూన్ నుండి సెప్టెంబర్ వరకు విస్తరించే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. అందువల్లనే, భారతీయ రైతాంగానికి అత్యంత కీలకమైన ఖరీఫ్ (వర్షాకాలం) పంటల విజయా పజయాలు పూర్తిగా ఈ వర్షాల పంపిణీపైనే ఆధారపడి ఉంటాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు, భూతాపం (గ్లోబల్ వార్మింగ్) ప్రభావాలు మరియు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే 'ఎల్‌నినో' వంటి తీవ్ర సముద్ర వాతావరణ పరిస్థితులు రుతుపవనాల గమనాన్ని తీవ్రంగా గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీని ఫలితంగా ఒకే ఏడాదిలో కొన్ని ప్రాంతాల్లో మేఘమథనంతో కూడిన అతివృష్టి, మరికొన్ని ప్రాంతాల్లో చుక్క నీరు లేని అనావృష్టి ఏర్పడి వర్షపాత పంపిణీలో తీవ్రమైన ప్రాంతీయ అసమతుల్యాత చోటు చేసుకుంటోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో కాలం చెల్లిన సంప్రదాయ సాగు విధానాలను పక్కనబెట్టి, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలోనూ, సాగు నిర్వహణలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకు రావలసిన చారిత్రక అవసరం నేడు రైతాంగంపై ఉంది.



శాస్త్రీయ కోణంలో పరిశీలిస్తే, ఎల్‌నినో అనేది దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని సూచించే ఒక సంక్లిష్ట వాతావరణ ప్రక్రియ. స్పానిష్ భాషలో 'చిన్న బాలుడు' లేదా 'ఏసుక్రీస్తు శిశువు' అని పిలవబడే ఈ దృగ్విషయం, ప్రపంచవ్యాప్త వాతావరణ నమూనాలను తలకిందులు చేసే శక్తిని కలిగి ఉంది. పసిఫిక్ సముద్రంలో పెరిగే ఈ ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వాతావరణ పీడన వ్యవస్థల్లో మార్పులు వచ్చి, భారత దేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవన గాలులు బలహీన పడతాయి. భారత వాతావరణ శాఖ గత వందేళ్ల చారిత్రక గణాంకాలను పరిశీలిస్తే, దేశంలో నమోదైన భయంకరమైన కరవు సంవత్సరాలలో అత్యధిక భాగం ఎల్‌నినో ప్రభావంతో కూడుకున్నవేనని స్పష్టమవుతోంది. ఉదాహరణకు, 2002 వ సంవత్సరంలో ఎల్‌నినో కారణంగా దేశంలో 19 శాతం వర్షపాత లోటు ఏర్పడి అపార పంట నష్టం సంభవించింది. అలాగే 2009లో గత నాలుగు దశాబ్దాలలోనే అత్యంత తీవ్రమైన కరవు నమోదైంది. ఆ తర్వాత 2015 మరియు ఇటీవలి 2023 సంవత్సరాలలో సైతం ఎల్‌నినో దేశవ్యాప్త వర్షపాతంలో భారీ లోటును మిగిల్చింది, తద్వారా జలాశయాలలో నీటి మట్టాలు పడిపోయి, భూగర్భ జలాధారాలు అడుగంటి వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయింది.

సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి వారంలోనే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, ఎల్‌నినో సంవత్సరాల్లో వర్షాలు వారాల తరబడి ఆలస్యమవడం లేదా ప్రారంభంలో కురిసి ఆ తర్వాత సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడటం సర్వసాధారణం. జూన్, జూలై నెలల్లో కురిసే తొలి వర్షాలను నమ్మి రైతులు తొందరపడి విత్తనాలు చల్లితే, ఆ తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో నేలలోనే విత్తనాలు మాడిపోయి మొలకెత్తని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది రైతులకు పెట్టుబడి నష్టాన్ని మిగల్చడమే కాకుండా, మళ్లీ విత్తవలసిన దుస్థితికి దారితీస్తుంది. ఇటువంటి అనిశ్చిత సమయాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రాథమిక సూచన ఏమిటంటే, రైతులు తొందరపాటు పడకుండా తమ ప్రాంతంలో కనీసం 75 నుండి 100 మిల్లీమీటర్ల వరకు స్థిరమైన మరియు తగినంత వర్షపాతం నమోదై, భూమి లోపలి పొరల వరకు తేమ చేరినట్లు నిర్ధారించుకున్న తర్వాతే ప్రధాన పంటల విత్తన ప్రక్రియను ప్రారంభించాలి. ఒకవేళ కాలం గడుస్తున్నా వర్షాలు పడకపోతే, సుదీర్ఘ కాల పరిమితి గల పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ రోజుల్లోనే చేతికి వచ్చే స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలి. ఇందుకోసం ఆయా రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వశాఖలు రూపొందించే 'ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను' నిరంతరం గమనిస్తూ అమలు చేయాలి.

సాధారణ వాతావరణ పరిస్థితుల్లో జూన్ మాసంలో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశెనగ, వరి వంటి సాంప్రదాయ ఖరీఫ్ పంటల సాగు జోరందుకుంటుంది. అయితే వర్షాలు జూలై మొదటి వారం వరకు ఆలస్యమైతే, రైతులు తమ వ్యూహాన్ని మార్చుకోవాలి. ఎక్కువ నీరు, ఎక్కువ కాలం తీసుకునే రకాలకు బదులుగా స్వల్పకాలిక మొక్కజొన్న రకాలు, పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు లేదా నువ్వులు వంటి నూనెగింజల పంటల వైపు మళ్లడం ఎంతో శ్రేయస్కరం. ఒకవేళ వర్షాభావం మరింత తీవ్రమై జూలై రెండో పక్షం లేదా ఆగస్టు వరకు కూడా తగినంత వర్షపాతం లేకపోతే, అసలు సంప్రదాయ పంటల ఆలోచనే పక్కనబెట్టి జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగుకు శ్రీకారం చుట్టాలి. ఈ తృణధాన్యాలు అత్యంత తక్కువ నీటి లభ్యతతో, కరవు పరిస్థితులను సైతం తట్టుకుని అద్భుతంగా పెరుగుతాయి. పైగా ప్రస్తుత కాలంలో ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడం వల్ల మార్కెట్లో ఈ చిరుధాన్యాలకు మరియు పప్పుధాన్యాలకు అత్యధిక డిమాండ్, మద్దతు ధర లభిస్తుండటం రైతులకు అదనపు ఆర్థిక రక్షణ కల్పిస్తుంది.

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఖరీఫ్ సీజన్ అనగానే అత్యధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేయడం కనిపిస్తుంది. పత్తి లాభదాయక పంట అయినప్పటికీ, దానికి ప్రారంభ దశలోనూ, పూత,కాత దశల్లోనూ సమతుల్యమైన తేమ అవసరం. ఎల్‌నినో సృష్టించే వర్షాభావ పరిస్థితుల్లో పత్తి మొక్కల పెరుగుదల క్షీణించి, దిగుబడులు దారుణంగా పడిపోతాయి. కాబట్టి, వాతావరణం అనుకూలించనప్పుడు పత్తి సాగు విస్తీర్ణాన్ని ఐచ్ఛికంగా తగ్గించుకుని, దానికి ప్రత్యామ్నాయంగా అంతర పంటల పద్ధతిలో కంది, పెసర, మినుము వంటి లెగ్యుమినేస్ (నత్రజనిని స్థిరపరిచే) పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా, ఒక పంట దెబ్బతిన్నా మరో పంట ద్వారా పెట్టుబడిని రాబట్టుకునే వీలుంటుంది.

ఇక తెలుగు ప్రజల ప్రధాన ఆహార పంట అయిన వరి సాగు విషయానికి వస్తే, నీటి వినియోగంపై పెను మార్పులు రావాల్సి ఉంది. ఎకరానికి వేల లీటర్ల నీరు అవసరమయ్యే సంప్రదాయ వరద నీటి పద్ధతి వరి సాగుకు ఎల్‌నినో కాలంలో స్వస్తి చెప్పక తప్పదు. సుదీర్ఘ కాలపరిమితి గల వరి రకాల స్థానంలో 120 రోజుల లోపు పండే స్వల్పకాలిక మరియు నీటి ఎద్దడిని తట్టుకునే రకాలను ఎంచుకోవాలి. అలాగే, సాంప్రదాయ పద్ధతిలో నారు పోసి, నీరు నిలగట్టి నాట్లు వేసే విధానానికి స్వస్తి పలికి, 'నేరుగా విత్తే వరి పద్ధతి' లేదా 'శ్రీ వరి విధానం' వంటి అధునాతన నీటి పొదుపు సాంకేతికతలను అవలంబించాలి. ఈ ఆధునిక పద్ధతుల ద్వారా సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడి తగ్గకపోగా, నీటి వినియోగాన్ని 25 నుండి ఏకంగా 40 శాతం వరకు ఆదా చేయవచ్చు. నీటి లభ్యత తక్కువగా ఉన్న తరుణంలో ప్రతి నీటి బొట్టును అమృతంగా భావించి పొదుపుగా వాడుకోవడమే వ్యవసాయాన్ని నిలబెడుతుంది.

పంటల ఎంపిక ఎంత ముఖ్యమో, పడిన వర్షపు నీటిని భూమిలో ఇంకించి, నేల తేమను సంరక్షించుకోవడం అంతకంటే ముఖ్యం. వేసవి లోతైన దుక్కులు చేయడం వల్ల వర్షపు నీరు త్వరగా భూమిలోకి ఇంకుతుంది. పొలం చుట్టూ గట్లను బలోపేతం చేయడం, వాలుకు అడ్డంగా కాంటూర్ బండ్లు (గట్లు) ఏర్పాటు చేయడం వల్ల వర్షపు నీరు వృధాగా కొట్టుకుపోకుండా ఆ పొలంలోనే నిలిచి భూగర్భ జలమట్టాన్ని పెంచుతుంది. పంట వ్యర్థాలను, ఆకులను నేలపై పరచడం (మల్చింగ్ పద్ధతి) ద్వారా సూర్యరశ్మి నేరుగా నేలపై పడకుండా నిరోధించవచ్చు, తద్వారా భూమిలోని తేమ ఆవిరి కాకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. ప్రతి గ్రామంలోనూ, పొలాల్లోనూ ఫార్మ్ పాండ్లు (పంట సంజీవని కుంటలు), చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ద్వారా అత్యవసర సమయాల్లో పంటలను కాపాడుకోవడానికి అవసరమైన రక్షక తడులను అందించే వీలు కలుగుతుంది.

ఈ విపత్కర వాతావరణాన్ని తట్టుకోవడంలో విత్తన శుద్ధి కీలక పాత్ర పోషిస్తుంది. కరవును, తెగుళ్లను తట్టుకునే ధృవీకరించబడిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే సేకరించి, విత్తే ముందు తగిన శిలీంద్రనాశకాలు లేదా జీవ నియంత్రణ కారకాలతో విత్తన శుద్ధి చేయడం వల్ల మొలక శాతం పెరగడమే కాకుండా, ప్రారంభ దశలో వచ్చే వ్యాధుల నుండి మొక్కలకు రక్షణ లభిస్తుంది. అలాగే, ఎల్‌నినో సమయాల్లో విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల మొక్కలు మరింత త్వరగా ఎండిపోయే ప్రమాదం ఉంది. అందుకే, ముందస్తుగా నేల పరీక్షలు నిర్వహించి, భూమిలో ఉన్న పోషకాల లభ్యతను బట్టి శాస్త్రీయంగా అవసరమైన మోతాదులోనే ఎరువులను, సేంద్రీయ మరియు ద్రవ రూప ఎరువులను (లిక్విడ్ ఫెర్టిలైజర్స్) సూక్ష్మ నీటి పారుదల (డ్రిప్ లేదా స్ప్రింక్లర్) పద్ధతుల ద్వారా అందించాలి.

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయానికి జోడించడం అత్యంత ఆవశ్యకమైన అంశం. భారత వాతావరణ శాఖ, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు ఉపగ్రహ సమాచారం ఆధారంగా నిరంతరం అందిస్తున్న జిల్లా,మండల స్థాయి స్వల్పకాలిక, మధ్యకాలిక వాతావరణ సూచనలను రైతులు గమనిస్తూ ఉండాలి. మొబైల్ యాప్ల ద్వారా అందుతున్న ఐదు రోజుల ముందస్తు వాతావరణ అంచనాల ఆధారంగా విత్తడం, ఎరువులు వేయడం, పురుగు మందుల పిచికారీ వంటి సాగు పనులను ప్రణాళిక చేసుకోవడం ద్వారా అనవసరపు ఖర్చులను, వాతావరణ నష్టాలను అధిగమిం చవచ్చు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రకృతి వైపరీత్యాల తీవ్రత వల్ల పంట నష్టం సంభవిస్తే రైతులు ఆర్థికంగా చితికిపోకుండా ఉండేందుకు 'వ్యవసాయ బీమా పథకాలు' ఒక అద్భుతమైన రక్షణ కవచంలా పనిచేస్తాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి ప్రభుత్వ పంట బీమా పథకాలలో అర్హులైన రైతులందరూ గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. వ్యక్తిగత సాగు వ్యయాలను తగ్గించుకోవడానికి, చిన్న, సన్నకారు రైతులు గ్రూపులుగా ఏర్పడి 'రైతు ఉత్పత్తిదారుల సంఘాలు' లేదా సహకార సంఘాల ద్వారా ఉమ్మడిగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం మరియు యంత్రాలను అద్దెకు తీసుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చు. దళారీల వ్యవస్థను దాటి ఉమ్మడి మార్కెటింగ్ సదుపాయాల ద్వారా తమ ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను సాధించుకోవచ్చు.

ఎల్‌నినో సృష్టిస్తున్న వాతావరణ మార్పులు కేవలం తాత్కాలిక సమస్య కాదు, ఇది గ్లోబల్ వార్మింగ్ సృష్టిస్తున్న దీర్ఘకాలిక సవాలు. భవిష్యత్తులో ఈ అనిశ్చితి మరింత తీవ్రరూపం దాల్చుతుందని అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, రైతాంగం పాతకాలపు మూస పద్ధతులకే పరిమితం కాకుండా, ఆధునిక శాస్త్రీయ సాగు విధానాలను, జల సంరక్షణ సూత్రాలను, వాతావరణ ఆధారిత వ్యవసాయ ప్రణాళికలను మరియు పంటల వైవిధ్యీకరణను తమ జీవితంలో భాగం చేసుకోవాలి. విపత్తును సైతం ఒక అవకాశంగా మలచుకుని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే చాకచక్యం ప్రదర్శించినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. దేశ రక్షణలో సైనికుడు ఎంత కీలకమో, దేశ ఆహార భద్రతలో అన్నదాత పాత్ర అంతకంటే మిన్న. కాబట్టి, రైతుల అప్రమత్తత, శాస్త్రీయ అవగాహనలతో పాటు ప్రభుత్వాల సకాల సాయం, రాయితీలు, మౌలిక వసతుల కల్పన తోడైతే, ఎల్‌నినో వంటి ఎన్ని ఎల్‌నినోలు ఎదురైనా ఖరీఫ్ సీజన్‌లో రైతాంగం విజయ కేతనం ఎగురవేసి, దేశాన్ని సుభిక్షంగా ఉంచగలదనడంలో ఎటువంటి సందేహం లేదు.


**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# యూరియా యాప్ - నిరక్షరాస్య రైతుల గోస



వ్యవసాయం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెడుతున్నాయి. ఈ క్రమంలో ఎరువుల పంపిణీలో పారదర్శకత తీసుకురావడం, అక్రమ నిల్వాలు మరియు బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడం లక్ష్యంగా యూరియా విక్రయాలను డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నారు. యాప్ ఆధారిత వ్యవస్థ ద్వారా రైతుల వివరాలను నమోదు చేసి యూరియా విక్రయాలు చేపడుతున్నారు. అయితే ఈ విధానం లక్ష్యం మంచిదైనా, నిరక్షరాస్య రైతులకు మాత్రం అనేక ఇబ్బందులను తెచ్చిపెడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ అనేక మంది రైతులు చదువుకోలేదు. కొందరు సంతకం చేయలేని పరిస్థితిలో కూడా ఉన్నారు. అలాంటి రైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం, యాప్ నిర్వహణ, డిజిటల్ లావాదేవీలు వంటి అంశాలు కొత్తగా, క్లిష్టంగా అనిపిస్తున్నాయి. యూరియా కొనుగోలు సమయంలో ఆధార్ నంబర్ నమోదు చేయడం, మొబైల్ నంబర్ ధృవీకరణ, యాప్లో వివరాలు నమోదు చేయడం వంటి ప్రక్రియలు వారికి పెద్ద సవాలుగా మారుతున్నాయి.




ప్రస్తుతం చాలా గ్రామాలలో రైతులు యూరియా కొనుగోలు కోసం ఎరువుల దుకాణాలకు వెళ్లినప్పుడు యాప్‌లో నమోదు తప్పనిసరి అవుతోంది. యాప్ సక్రమంగా పనిచేయకపోతే లేదా ఇంటర్నెట్ సమస్యలు ఎదురైతే రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వ్యవసాయ పనులు సీజన్‌కు అనుగుణంగా సమయానికి జరగాలి. విత్తనాలు వేసిన తర్వాత లేదా పంట ఎదుగుదల దశలో యూరియా అవసరమైన సమయంలో అందుబాటులో లేకపోతే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో యాప్ సాంకేతిక సమస్యలు రైతులకు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

నిరక్షరాస్య రైతులలో చాలామందికి స్మార్ట్‌ఫోన్‌లు కూడా లేవు. ఉన్నవారిలో చాలామంది కేవలం ఫోన్ కాల్స్ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఓపెన్ చేయడం, అవసరమైన వివరాలు నమోదు చేయడం వంటి పనులు వారికి తెలియవు. దీంతో వారు ఇతరుల సహాయం కోరాల్సి వస్తోంది. కొన్నిసార్లు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల రైతుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే ప్రమాదం కూడా ఉంది. వృద్ధ రైతుల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. జీవితాంతం సంప్రదాయ వ్యవసాయం చేసిన వారు ఒక్కసారిగా డిజిటల్ వ్యవస్థలకు అలవాటు పడలేరు. వయస్సు కారణంగా కొత్త సాంకేతికతను నేర్చుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రభుత్వం రైతులకు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన యాప్, వృద్ధ మరియు నిరక్షరాస్య రైతులకు భారంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అయితే యూరియా యాప్‌నకు కొన్ని సానుకూల అంశాలు కూడా ఉన్నాయి. ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుంది. నిజమైన రైతులకు యూరియా అందే అవకాశం ఉంటుంది. అక్రమ నిల్వాలు, బ్లాక్ మార్కెట్ విక్రయాలను కొంతవరకు నియంత్రించవచ్చు. రైతుల కొనుగోలు వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కావడం వల్ల భవిష్యత్తులో పథకాల అమలుకు కూడా ఉపయోగపడుతుంది. కానీ ఈ ప్రయోజనాలు రైతులందరికీ చేరాలంటే వ్యవస్థ మరింత సులభంగా ఉండాలి. ప్రభుత్వం యాప్‌ను ప్రవేశపెట్టడమే కాకుండా రైతులకు అవసరమైన శిక్షణ కూడా అందించాలి. గ్రామ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యాప్ వినియోగంపై రైతులకు శిక్షణ ఇవ్వాలి. వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు వేదికలు, వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా రైతులకు ప్రాయోగిక శిక్షణ కల్పించాలి. ప్రతి గ్రామంలో డిజిటల్ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఉచిత సహాయం అందించాలి.

అలాగే యాప్తో పాటు ప్రత్యామ్నాయ విధానాన్ని కూడా కొనసాగించడం అవసరం. సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు రైతులు ఇబ్బంది పడకుండా ఆఫ్లైన్ విధానంలో కూడా యూరియా కొనుగోలు చేసే అవకాశం కల్పించాలి. ముఖ్యంగా వృద్ధులు, నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి. రైతు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాల ఆధారంగా ఎరువులు పొందే వెసులుబాటు ఉండాలి.

డిజిటల్ ఇండియా లక్ష్యాల సాధనలో భాగంగా వ్యవసాయ రంగంలో సాంకేతికతను ప్రోత్సహించడం అవసరమే. కానీ సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు సౌలభ్యం కల్పించాలి గానీ ఇబ్బందులకు కారణం కాకూడదు. గ్రామీణ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని విధానాలను రూపొందించాలి. ముఖ్యంగా నిరక్షరాస్య రైతుల సమస్యలను అర్థం చేసుకుని వారికి అనుకూలంగా వ్యవస్థను సరళీకృతం చేయాలి. వేసవికాలంలో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాలు పర్యటించి గ్రామంలో ఉన్న రైతలందరిని కలిసి వారికి ఎంత వ్యవసాయ భూమిఉంది, వారికి ఎంత యూరియా అవసరమంటుంది, ఏ పంటలు వేయ తలుచుకున్నారు లాంటి వివరాలన్నీ సేకరించి దళారి వ్యవస్థకు స్వస్తి పలికి ఆయా గ్రామాలకు కావలసిన నాణ్యమైన విత్తనాలను యూరియాను, ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఎరువులదుకాణ యజమానుల ద్వారా నేరుగా రైతు ఇంటి దగ్గర అందించేలా ప్రణాళిక ఏర్పాటు చేస్తే ఎలాంటి గందరగోళం ఉండదు. యాప్ కంటే కూడా ఇది మేలైన మార్గం అవుతుంది.

**- బూర్గుపల్లి కృష్ణ యాదవ్**
9866170384

# నేలల్ని ఎడారులుగా మార్చుతున్నామా !



నిస్సార భూమికి తిరిగి జీవం పోసే శక్తి మనకు ఉంది. నేలల్ని పునరుద్ధరిస్తే పలు నూతన అవకాశాలు సృష్టించ బడతాయి. నేడు అలాంటి అవకాశాలకు ద్వారాలు తెరవాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. ఆరోగ్యకర పర్యావరణం మీదనే 50 శాతం ప్రపంచ జిడిపీ ఆధారపడి ఉంటుంది. నేడు ప్రతి ఏట ఈజిప్ట్ దేశమంత భూభాగం క్షీణించిపోతున్నది. దీని వల్ల జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లడం, కరువులు పెరగడం, ధరలు పెరగడం, అస్థిరత రాజ్యమేలడం, పౌర సమాజం వలసల స్థానభ్రంశం చెందడం జరుగుతుంది. భూమిని పునరుద్ధరిస్తే ఉత్పాదకత పెరగడం, ఆహార భద్రత సాధించడం, నీటి చక్రాలు బలపడడం, గ్రామీణులకు జీవనోపాధులు పెరగడం జరుగుతుంది.

భూ క్షీణత, కరువులు అనేవి అవిభాజ్యమైన అనర్థాలు. వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది, ఆహార ఉత్పత్తులు తగ్గుతాయి, జీవన నాణ్యతకు కోతపడుతుంది, నీటి లభ్యతకు గండి పడుతుంది. నేల క్షీణత, ఎడారీకరణ అనర్థాలను అడ్డుకోవడం, పునరుద్ధరించడం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 17 జూన్ రోజున ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినోత్సవం పాటించాలని 1994లో ఐరాస తీర్మానించడం, 1995 నుంచి పాటించడం జరుగుతున్నది. 2026 ప్రపంచ ఎడారీకరణ, కరువు వ్యతిరేక దినం ఇతివృత్తంగా రేంజ్‌ల్యాండ్స్‌ను గుర్తించండి. గౌరవించండి. పునరుద్ధరించండి అనబడే అంశాన్ని తీసుకొని కొలంబియాలో సమావేశం నిర్వహిస్తున్నారు.

ప్రకృతికి పునాది సారవంతమైన నేల. ఇలాంటి ఆరోగ్యకర భూములను మానవ, ప్రకృతి ప్రమేయాలతో నిస్సారం, నిర్వీర్యం చేయడం జరుగుతోంది. ఇలాంటి నేల క్షీణత మరి కొంత కాలం కొనసాగితే శాశ్వతంగా పనికి రాని ఎడారులుగా మారి పోతాయని గమనించాలి. నేల ఎడారీకరణను అడ్డుకోని యెడల రాబోయే 25 ఏండ్లలో 12 శాతం ఆహార ఉత్పత్తులు పడిపోయి 30 శాతం వరకు సరుకుల ధరలు పెరుగుతాయి.

ఆహార అభద్రత ఉచ్చులో చిక్కుకున్న భారతంలో వ్యవసాయ ఉత్పత్తులను గణనీయంగా పెంచడానికి 1960ల్లో నార్మన్ బోర్లాంగ్ నాయకత్వంలో హరిత విప్లవం రావడం. సాగు దిగుబడులు పెరగడం, ఆహార భద్రత సాధించడం జరిగినప్పటికీ ఒకే రకమైన వరి, గోధుమ పంటలను దశాబ్దాలుగా పండించడం కారణంగా సారవంతమైన నేలల నాణ్యత క్షీణించడం, ఎడారీకరణ అంచున నిలబడడం జరిగింది. ఇప్పటికే రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో దాదాపు 5 మిలిమన్ హెక్టార్ల వ్యవసాయ నేలలు ఎడారీకరణ అంచున చేరాయి. అవగాహన లేమి, అశాస్త్రీయ సాగు పద్దతులతో సారవంతమైన నేలలు నిస్సారమై ఎడారి భూములుగా మారడాన్ని నేల ఎడారీకరణ అంటారు. ఎడారీరకణతో కరువుకు విడదీయరాని సంబంధం ఉంటుంది.

అడవుల నరికివేత, పశుగ్రాస అధిక వినియోగం, పోడు వ్యవసాయం, రోడ్ల నిర్మాణం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఒకే రక మైన పంటల్ని ఏండ్ల తరబడి వేయడం లాంటివి కూడా నేల ఎడారీకరణను వేగవంతం చేస్తాయి.

నేల ఎడారీకరణ సంక్షోభంతో 3 బిలిమన్ల మానవాళి పేదరికంలోకి నెట్టబడడం, ఒక బిలియన్ ప్రజలు ఆకలి చావుల అంచున నిలబడడం జరుగుతున్నది.

వ్యవసాయ నేలలకు సారం అందించని యెడల క్రమంగా శుష్క భూములుగా మారుతూ దిగుబడులు తగ్గుతూ, కోసుకోలేని ఎడారులుగా మారతాయి. అతిగా కృత్రిమ ఎరువులు వాడడం, విచక్షణారహితంగా రసాయనాలు వాడడం, అధిక నీటిని వినియోగించడం, అతిగా పురుగు మందులు వాడడం, అశాస్త్రీయ సాగు పద్దతులు లాంటి అంశాల వల్ల తాత్కాలికంగా దిగుబడులు పెరిగినా, క్రమంగా నేలలు నిస్సారమై ఎడారులను తలపిస్తాయి. మానవ కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలను అందించడానికి సారవంతమైన నేలలు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. నేల సారాన్ని కాపాడుకుంటూ, నాణ్యమైన మట్టి వాసనను ఆస్వాదిస్తూ, మట్టి మర్యాదను గౌరవిస్తూ, మట్టిలోంచి మాణిక్యాలను పండిద్దాం.



**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

**ఈ పేపర్ కోసం**
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి

– ఎడిటర్



# నీట్ యూజీ-2026 అభ్యర్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం

- జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి

**విశాఖపట్నం, జూన్ 18 మనం న్యూస్ :** నీట్ యూజీ-2026 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు (స్త్రీ, పురుషులకు) జూన్ 21న ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ నూతన ఒరిజినల్ హాల్ టికెట్ చూపించి మాత్రమే ఉచితంగా ప్రయాణించవచ్చని, పాత హాల్ టికెట్లు, ఫోటోకాపీలు లేదా ఇతర పత్రాలు చెల్లవని స్పష్టం చేశారు. ఈ సౌకర్యం పరీక్ష రోజు మాత్రమే అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ముందుగానే ప్రయాణ ప్రణాళిక రూపొందించుకోవాలని, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. విద్యార్థులందరూ ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించాలని జాయింట్ కలెక్టర్ ఆకాంక్షించారు.

# వాస్తవాలను వక్రీకరిస్తూ తప్పుదోవ పట్టిస్తున్న వైసిపి

## మంత్రి కొల్లు రవీంద్ర



**విశాఖపట్నం జూన్ 18 మనం న్యూస్:** రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర విశాఖ టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్సీ నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.పేర్ని నాని తమ పార్టీ నాయకుల వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా తప్పుగా అర్థం చేసుకుని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలు చేసినట్లు దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు.మహిళల గౌరవం గురించి మాట్లాడే వైసీపీ నాయకులు గతంలో మహిళల పట్ల జరిగిన అవమానకర వ్యాఖ్యలు, ఘటనలను మరచిపోయారని ఆరోపించారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై చేసిన వ్యాఖ్యలను కూడా మంత్రి ఖండించారు.పేర్ని నానిపై తీవ్ర ఆరోపణలు చేసిన కొల్లు రవీంద్ర, పేదల బియ్యం అక్రమాల కేసులో ఆయనపై ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం బెయిల్పై బయటకు వచ్చి విమర్శలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ నేతల మాటలే ఆ పార్టీ రాజకీయ భవిష్యత్తుకు సమాధి రాళ్లుగా మారతాయని వ్యాఖ్యానించారు.బీచ్ షాక్స్ విధానంపై స్పందిస్తూ, పర్యాటక రంగ ప్రోత్సాహంలో భాగంగా విశాఖపట్నం మరియు సూర్యలంక బీచ్ ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా బీచ్ షాక్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అన్ని ప్రభుత్వ శాఖలతో సంప్రదింపులు జరిపిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తక్కువ ఆల్కహాల్ శాతం కలిగిన పానీయాల విక్రయానికి మాత్రమే అనుమతులు ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వెలగపూడి రామకృష్ణ బాబు, చోడే వెంకట పట్టాభిరామ్, లోడగల కృష్ణ, బైరెడ్డి పోతన రెడ్డి పాల్గొన్నారు.



# గంజాయి కేసులో నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష

**అనకాపల్లి /కె.కోటపాడు జూన్,18 మనం న్యూస్ :** అనకాపల్లి జిల్లా, కె.కోటపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితునికి 9వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎం.హరి నారాయణ (చోడవరం) గురువారం కీలక తీర్పు వెలువరించారు.నిందితుడు (ఏ 1): కార్తీక్ (26),(తండ్రి: సుందరమూర్తి, వృత్తి: క్లీనర్, ఈరోడ్ గ్రామం/జిల్లా, తమిళనాడు.) నిందితుడి వద్ద నుంచి గతంలో 04 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. కోర్టులో నిందితుడు తనపై మోపబడిన అభియోగాలను స్వచ్ఛందంగా అంగీకరించాడు. చట్టపరంగా నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ, 02 (రెండు) సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ.1,000/- జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక వారం సాధారణ శిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశించింది. నిందితుడు 27.03.2024 నుండి 18.06.2026 వరకు రిమాండ్లో గడిపిన కాలాన్ని సి ఆర్ పి సి సెక్షన్ 428 ప్రకారం శిక్షా కాలంలో మినహాయించనున్నారు.ఈ కేసులోని రెండవ నిందితుడు (ఏ 2) ముచ్చల శ్రీను పై విచారణ ప్రస్తుతం కోర్టులో కొనసాగుతోంది.ఈ కేసును కె.కోటపాడు ఎస్సై రాజన ధనుంజయ్ అత్యంత సమగ్రంగా దర్యాప్తు చేసి, కోర్టులో పక్కా సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యప్రకాశరావు బలమైన వాదనలు వినిపించి నిందితుడికి శిక్ష పడేలా చేశారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, వివరాలు వెల్లడించిన అనంతరం ప్రజలకు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి, జూన్ 18 మనం న్యూస్:** జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయ వీసి హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్కు అందుతున్న ప్రజా వినతులను సంబంధిత మండలాలకు వెంటనే పంపించి, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అక్కడి ప్రజలను అవసరమైతే సమీప సచివాలయాలు, పాఠశాలలు లేదా ఇతర షెల్టర్లకు తరలించేలా ముందస్తు మ్యాపింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# చంద్రంపాలెం పాఠశాల.. ల్యాబ్ సందర్శన, తాళ్లవలస సచివాలయం తనిఖీ

**విశాఖపట్టణం, జూన్ 18 మనం న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ గురువారం భీమిలి డివిజన్ పరిధిలో సుడిగాలి పర్యటన చేశారు. తగరపువలసలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. తాళ్లవలస సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సేవలను పరిశీలించారు. చంద్రంపాలెం పాఠశాలను సందర్శించి అక్కడ దివిస్ సహకారంతో జరుగుతున్న మైదానం అభివృద్ధి పనులను చూశారు. అలాగే తగరపువలసలో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించి, ప్రజలతో, బీఎల్వోలతో మాట్లాడారు.క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా తగరపువలస వెళ్లిన ఆయన ముందుగా శ్రీమన్నారాయణ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం నూనతంగా అందుబాటులోకి



తీసుకొచ్చిన ఏపీఐఎంఎస్ యాప్ వినియోగం, ఓటీపీ ఆధారంగా యూరియా, డీఏపీ ఎరువుల సరఫరా తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఎరువుల సరఫరా ప్రక్రియ దుర్వినియోగం కాకుండా చూడాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అనంతరం తగరపువలస గ్రామంలో జరుగుతున్న సర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. ప్రజలు, బీఎల్వోలతో మాట్లాడి ప్రక్రియ కొనసాగుతున్న తీరుపై ఆరా తీశారు. పారదర్శకంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.అనంతరం తాళ్లవలస సచివాలయాన్ని తనిఖీ చేసి అక్కడ పరిస్థితులను గమనించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రగతి నివేదికలను, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే చంద్రంపాలెం పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడ జరిగిన అడ్మిషన్ల గురించి అడిగారు. తరగతులు ఏ విధంగా జరుగుతున్నాయి.. పాఠ్య పుస్తకాలు అందించారా లేదా అని ఆరా తీశారు. ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించి అక్కడి వారితో మాట్లాడారు. అలాగే దివిస్ సహకారంతో అభివృద్ధి చేస్తున్న మైదానాన్ని పరిశీలించారు.


# భక్తాదులకు మెరుగైన సేవలందిస్తాం



**నార్పల, జూన్ 18మనం న్యూస్:** గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తాదులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వసతులు కల్పిస్తామని ఆలయ ట్రస్ట్ చైర్మన్ రోసన్న గారి నాగార్జున, ఆలయ నిర్వహణ అధికారిని సాకేతపురం శోభ గురువారం పాత్రికేయులకు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తాదులకు అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తాదులకు మెరుగైన సేవలందిస్తామని.. ఇందుకోసం గ్రామస్తుల సహకారం, గ్రామ పెద్దల తోడ్పాటుతో భక్తాదులకు ఎలాంటి లోటుపాట్లు రానీయమని వారు ఈ సందర్భంగా వెల్లడించారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు అదనపు సిబ్బందితో బ్రహ్మోత్సవాల్లో పర్యవేక్షిస్తారని తెలిపారు. భక్తాదులకు మౌలిక వసతులు కల్పిస్తామని, ప్రణాళిక బద్ధంగా అన్ని శాఖల సిబ్బంది భక్తాదులకు సేవలు అందిస్తారని ఆలయ ట్రస్ట్ చైర్మన్ రోషన్న గారి నాగార్జున, ఆలయ కార్య నిర్వహణ అధికారిని శోభ తెలిపారు.

# గిరిజన ప్రాంతంలో రిసార్ట్స్ రాజ్యం..!

**అనుమతులెవరు ఇచ్చారు..?**
**రెడ్ జోన్లో రిసార్ట్స్ ఎలా..?**
**అధికారుల మౌనం ఎందుకు..?**



**పోలవరం జిల్లా,(చింతూరు, మనం న్యూస్) జూన్ 18:** అందమైన ప్రకతి సోయగాలకు నిలయంగా ఉన్న చింతూరు మండలంలోని పొల్లూరు జలపాతం, సీలేరు నదీ పరివాహక ప్రాంతం నిత్యం వేలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఆంధ్రప్రదేశ్తో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తుండటంతో ఈ ప్రాంతంలో ఇటీవల రిసార్ట్స్ సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే ఈ రిసార్ట్స్ ఏర్పాటుపై ఇప్పుడు అనేక అనుమానాలు, ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక గిరిజనులు, గ్రామస్తుల కథనం ప్రకారం, పర్యాటక సౌకర్యాల పేరుతో పదుల సంఖ్యలో రిసార్ట్స్ ఏర్పాటు చేయబడుతున్నాయని, వాటి వల్ల గ్రామీణ వాతావరణం దెబ్బతింటోందని ఆరోపిస్తున్నారు. కుటుంబాలతో వచ్చే పర్యాటకుల కంటే ఇతర కార్యకలాపాల కోసం వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉందని వారు చెబుతున్నారు.

**గిరిజన ప్రాంతాల్లో చట్టాలు ఏమంటున్నాయి..?**

చింతూరు ఏజెన్సీ ప్రాంతంగా గుర్తింపు పొందిన గిరిజన మండలం. ఇలాంటి ప్రాంతాల్లో భూముల కొనుగోలు, నిర్మాణాలు, వ్యాపార కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉన్నాయి. గిరిజన భూములను గిరిజనేతరులు స్వాధీనం చేసుకోవడం, వినియోగించడం చట్టపరమైన పరిమితులకు లోబడి ఉంటుంది. అలాంటి ప్రాంతాల్లో రిసార్ట్స్ నిర్మాణానికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు తప్పనిసరి. అయితే ప్రస్తుతం నడుస్తున్న రిసార్ట్లు పర్యాటక శాఖ, రెవెన్యూ శాఖ, గ్రామపంచాయతీ, అటవీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి తదితర విభాగాల నుంచి పూర్తి స్థాయి అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?**

రిసార్ట్లో బస చేసే సందర్శకుల వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా? పోలీస్ శాఖకు సమాచారం అందిస్తున్నారా? బయోమెట్రిక్ లేదా గుర్తింపు పత్రాల నమోదు జరుగుతోందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ప్రతిరోజూ ఎంతమంది వస్తున్నారు, ఎంత మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు, ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారా లేదా అనే అంశాలపై సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

# ప్రభుత్వ బడిలో కలెక్టర్ కుమారుడు..!!



- ఆదర్శంగా నిలిచిన జిల్లా మేజిస్ట్రేట్

**విజయనగరం: మనం న్యూస్ : జూన్ 18** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి ఒక అద్భుతమైన నిర్ణయంతో అందరికీ ఆదర్శంగా నిలిచారు. తన కుమారుడు ఎన్. క్రిష్ ధరణ్రెడ్డిని ఆయన స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.

**పదో తరగతిలో చేరిక...**

క్రిష్ ధరణ్రెడ్డి గత విద్యా సంవత్సరంలో విజయవాడలోని పడమట జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. తండ్రి ప్రభాకరరెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో.. క్రిష్ ధరణ్రెడ్డిని పార్వతీపురంలోని 'డాక్టర్ దిండిగల్ వెంకట్రావు మెమోరియల్ మున్సిపల్ పాఠశాల'లో పదో తరగతిలో చేర్పించారు.

**బాధ్యత పెరిగింది...**

ఒక జిల్లా మేజిస్ట్రేట్ స్థాయి అధికారి తన కుమారుడిని తమ పాఠశాలలో చేర్పించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ అబ్బాయి తమ బడిలో చేరడంతో పాఠశాల సిబ్బందిపై బాధ్యత మరింత పెరిగిందని, విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు మరింత కృషి చేస్తామని ఆయన 'పేర్కొన్నారు.

# ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయాలి



**అనంతపురం, కలెక్టరేట్ జూన్ 18 : మనం న్యూస్** యోగాంధ్ర - 2026 కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా పర్యాటక శాఖ మరియు ఆయుష్ ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణంలోని టూరిజం డెస్టినేషన్ ఆధ్యాత్మిక ప్రాంతం, పర్యాటక స్థలమైన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, మార్కెట్ యార్డు చైర్మన్ భూమా నాగరాగిని, తదితరులు పాల్గొన్నారు. ఇందులో జిల్లా కలెక్టర్, మార్కెట్ యార్డు చైర్మన్, తదితరులు యోగాసనాలు చేసి అందరిలో స్ఫూర్తి నింపారు. యోగా మాస్టార్లు డా.ఏ.మురళీకృష్ణ, రవిప్రసాద్, గోవిందరెడ్డి, మమతా కర్నూలు, ఎం.రాజశేఖర్ రెడ్డి, తిప్పయ్య అందరిచేత యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా తాడిపత్రి పట్టణంలోని ఆధ్యాత్మిక ప్రాంతం, పర్యాటక స్థలమైన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించామన్నారు. యోగ మీద అందరికీ అవగాహన ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై అవగాహన వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలన్నారు.

# విశాఖపట్నం రేంజ్లో మాదకద్రవ్యాల నిర్మూలనకు బహుముఖ వ్యూహం




- 'జీరో కల్టివేషన్' సాధనే లక్ష్యం
- నేడు 490 కేసులకు సంబంధించిన రూ. కోట్లాది విలువైన 20,876 కిలోల గంజాయి, 23.68 కిలోల హషీష్ ఆయిల్ బహిరంగ ధ్వంసం

**విశాఖపట్నం, జూన్ 18 మనం న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం' నిర్మాణంలో భాగంగా విశాఖపట్నం రేంజ్ పోలీస్ శాఖ చారిత్రాత్మక విజయాలను నమోదు చేస్తోంది. గంజాయి సాగు, అక్రమ రవాణా, మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టడమే ధ్యేయంగా చట్టపరమైన నిర్బంధాలు, కఠిన చర్యలతో పాటు సామాజిక అవగాహన, ప్రత్యామ్నాయ జీవనోపాధి కార్యక్రమాలతో కూడిన సమగ్ర కార్యాచరణను పోలీసులు విజయవంతంగా అమలు చేస్తున్నారు.హోం మంత్రి వర్యులు వంగలపూడి అనిత మాట్లాడుతూ: రాష్ట్రంలో మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని స్థాపించడమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతూనే, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించి రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాము. యువతను డ్రగ్స్ బారిన పడకుండా రక్షించేందుకు విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాము. గంజాయి నెట్వర్క్ను సమూలంగా ధ్వంసం చేయడానికి అంతరాష్ట్ర, అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ, నిందితుల ఆస్తులను సైతం అటాచ్ చేస్తున్నాం. పోలీసుల పటిష్టమైన నిఘా, అంకితభావం వల్లే నేడు విశాఖ రేంజ్ 'జీరో కల్టివేషన్' దిశగా చారిత్రాత్మక అడుగులు వేసిందన్నారు.'


# అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ వేదికగా రాష్ట్రస్థాయి శిక్షణ



**విశాఖపట్నం, జూన్ 18 మనం న్యూస్:** అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా 'డ్రింక్ ఫ్రం ట్యాప్ ప్రాజెక్టు అమలుపై మూడు రోజుల శిక్షణ మరియు పరస్పర అభ్యాస కార్యక్రమం గురువారం జీవీఎంసీ పాత కౌన్సిల్ హాలులో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని సీపీహెచ్ఈఈఓ , అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా , గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్ర ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ పట్టణ అవసరాలకు అనుగుణంగా ప్రతి ఇంటికి సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని 24 గంటలూ అందించేందుకు 'డ్రింక్ ఫ్రం ట్యాప్' కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల అధికారులు, ఇంజనీర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణ విధానాలపై అవగాహన పెంపొందించుకోవడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమన్నారు.కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ, ఏపీయూఎఫ్ఐడీసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ వాణి, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కామేశ్వరరావు, ఎ ఎస్ సి ఐ అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం. స్నేహలత పాల్గొన్నారు.

# గురుకులంలో కలెక్టర్-ఎమ్మెల్యే సందడి

**శ్రీ సత్యసాయి, జూన్ 18 మనం న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం నసనకోటలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం పుస్తకాల పంపిణీ, మొక్కల నాటడం కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంయుక్తంగా హాజరై విద్యార్థినులకు ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి పర్యావరణ స్పృహతో మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని ఉన్నత స్థాయికి చేర్చేలా కృషి చేయాలని సూచించారు.



పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న బాలికలకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థినులు విద్యను ఆయుధంగా చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# కూటమి రెండేళ్ల పాలనపై విజయోత్సవ సభ

**కదిరి,జులై18మనంన్యూస్:-** కూటమి ప్రభుత్వం కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని ఇంపీరియల్ గార్డెన్ కళ్యాణ మండపంలో రెండేళ్ల కాలంలో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరును ఆకాంక్షిస్తూ కూటమి సభ ఏర్పాటు చేసి ప్రజల ఆశీర్వాదం గురువారం ప్రజలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ:-ప్రధాని మోదీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని తెలిపిన ఎమ్మెల్యే పెన్షన్ల పెంపు, వ్యవసాయ రంగ బలోపేతం, మహిళా సాధికారిక, యువతకు ఉపాధి, రహదారుల నిర్మాణం, విద్యా వైద్యం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన కూటమి ప్రభుత్వం పోలవరం పనులు వేగవంతం' గ్రామీణాభివృద్ధికి పెద్దపీట' పారదర్శక పాలనతో కూటమి ప్రభుత్వ విజయాలకు నిదర్శనం ఎడారి జిల్లాకు కృష్ణా జలాలు తీసుకురావడంలో తెలుగుదేశం పార్టీ చారిత్రాత్మక నిర్ణయం గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, అంతేకాకుండా కదిరి పట్టణ అభివృద్ధికి తన జీవితాన్ని త్యాగం చేస్తానని పట్టణంలోని ప్రజా సమస్యలను దగ్గరుండి పరిష్కరిస్తానని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పనిచేసే ఓటర్ వెరిఫికేషన్ సర్ కార్యక్రమానికి గ్రామ కార్యదర్శిలు, గ్రామ టిడిపి నేతలు కార్యకర్తలు కలిసి పనిచేసి ఓటర్ వెరిఫికేషన్ పూర్తిచేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు.



# భూములిచ్చిన రైతులకు త్వరలోనే పరిహారం ఇస్తాం

- పేరూరు ప్రాజెక్టు పరిశీలన సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హామీ

**అనంతపురం, జూన్ 18 మనం న్యూస్ :** పేరూరు ప్రాజెక్ట్ కు నీరందించే పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ కోసం భూములిచ్చిన ప్రతి రైతుకు త్వరలోనే పరిహారం అందిస్తామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన ఎమ్మెల్యే పరిటాల శ్రీరామ్, పరిటాల సునీతతో కలిసి రామగిరి, కనగానపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీ బిజీగా గడిపారు. ముందుగా కనగానపల్లి మండల కేంద్రంలోని రెడ్డివారి కుంట చెరువు మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ చెరువు మరమ్మతులకు ఇప్పటికే 86లక్షల రూపాయలు విడుదల చేయగా.. ఈ పనులను కలెక్టర్, ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. గతంలో చెరువు కట్ట తెగి పొలాలకు నష్టం వాటిల్లిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఉపాధి హామీ పథకం కింద అక్కడ పనులు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రైతు శ్రీనాథ్ సాగు చేసిన వేరుసెనగ పంటను పరిశీలించారు. పంట ఎప్పుడు వేశారు.. ప్రస్తుతం ఎలా ఉంది.. దిగుబడి ఎంత వస్తుందన్నది తెలుసుకున్నారు. ఆ తర్వాత జీడిపల్లి రిజర్వాయర్ నుంచి - అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు (పేరూరు ప్రాజెక్ట్) వరకు జరుగుతున్న 54కిలోమీటర్ల పరిటాల రవీంద్ర సాగునీటి పథకం కాలువ పనులను పరిశీలించారు. వేపకుంట గ్రామ సమీపంలోని 32.2వ కిలోమీటర్ వద్ద ఈ పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ స్థానిక రైతులు పాల్గొన్నారు.



# కొండేపూడికి పాత్రికేయుల నివాళి



కాట్రేనికోన, జూన్ 17 మనం ప్రతి నిధిః సీనియర్ పాత్రికేయుడు,విశాలాంధ్ర దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ కొండేపూడి సత్యనారాయణఇటీవల తనువు చాలించిన సంగతి తెలిసిందే. కాట్రేనికోన సచివాలయం వద్ద గురువారం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు పాత్రికేయులు హాజరయ్యారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలవాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.జర్నలిస్టుగా సత్యనారాయణ సమాజానికి చేసిన సేవలను ఈ సందర్భంగావీరు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో అయితా బత్తులశీను బాబు, గోనెమడతల బ్రహ్మాజీ, మట్టపర్తి రవి, కాశి సురేష్, గంటి బోస్, కే రవి, జగడం శ్రీనివాస్,బడుగు శ్రీనివాస్, కాశి చక్రి, ఆటో యూనియన్ నాయకులు గజినీ, గణేష్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం రత్నగిరిపై భద్రతా వైఫల్యం?

## సెక్యూరిటీ సిబ్బంది విధుల నిర్వహణపై అనుమానాలు - మద్యం సీసాల కలకలం కలవరపెడుతోంది

అన్నవరం, జూన్ 18, మనం న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం రత్నగిరిపై భక్తుల భద్రత, దేవస్థానం ఆస్తుల పరిరక్షణ కోసం వంద మందికి పైగా భద్రతా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ, భద్రతా వ్యవస్థ పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొండపైన, కొండ దిగువన ఉన్న కీలక ప్రాంతాల్లో సెక్యూరిటీ సిబ్బందిని నియమించినప్పటికీ, కొంతమంది విధులకు సక్రమంగా హాజరవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హాజరు పట్టీతో పాటు బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను దేవస్థానం అమలు చేసింది. అయినప్పటికీ కొందరు సిబ్బంది హాజరు నమోదు చేసిన తరువాత విధులకు గైర్హాజరవుతున్నారనే ఫిర్యాదులు రావడంతో ఈవో చక్రధరరావు ప్రత్యేకంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. విచారణలో కొందరు సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో వారి జీతాల్లో కోత విధించినట్లు తెలిసింది. అయితే ఈ చర్యల తరువాత కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని



విమర్శకులు అంటున్నారు. కొందరు సిబ్బంది విధి ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదనే అనుమానాలు కొనసాగుతున్నాయి. దీనికి తాజా ఉదాహరణగా దేవస్థానం కళాశాల మైదానంలో ఖాళీ మద్యం సీసాలు బయటపడిన ఘటనను స్థానికులు ప్రస్తావిస్తున్నారు. దేవస్థానం ఈవో నివాసానికి సమీపంలోనే ఉన్న కళాశాల మైదానంలో మద్యం సేవించిన ఆనవాళ్లు కనిపించడం భద్రతా వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. రాత్రి వేళల్లో ఆ ప్రాంతంలో ఎవరెవరు సంచరిస్తున్నారు? భద్రతా సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. భక్తులు, స్థానికులు మాత్రం కొండపై ఉన్న అన్ని సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, సెక్యూరిటీ సిబ్బంది హాజరు మాత్రమే కాకుండా వారి విధి నిర్వహణను కూడా నిరంతరం పర్యవేక్షించాలని కోరుతున్నారు. ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు నమోదు చేయడం ఒక్కటే సరిపోదని, విధి సమయంలో క్షేత్రస్థాయి తనిఖీలు పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే అన్నవరం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలో భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన ఘటనలపై దేవస్థానం యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# అన్నవరం కొండపై ఫ్రీ వైఫై సేవలు



- నగదు రహిత లావాదేవీలకు మరింత ఊతం

అన్నవరం,జూన్ 18, మనం న్యూస్ : అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు చర్యలను వేగవంతం చేస్తున్నారు. ఇందులో భాగంగా నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు కొండపైన తొలిసారిగా ఉచిత ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. 'అన్నవరం ఫ్రీ వైఫై' పేరుతో ఏర్పాటు చేసిన ఈ సేవ ద్వారా భక్తులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో సులభంగా ఇంటర్నెట్ వినియోగించుకునే అవకాశం కల్పించారు. ముఖ్యంగా దర్శనం టికెట్లు, ప్రసాదాల కొనుగోలు, వసతి గదుల బుకింగ్, ఇతర సేవలకు సంబంధించిన ఆన్లైన్ చెల్లింపులు సులభంగా నిర్వహించేందుకు ఈ సౌకర్యం ఉపయోగపడనుంది. ప్రత్యేకత ఏమిటంటే, ఈ వైఫై సేవకు ఎటువంటి పాస్వర్డ్ అవసరం లేకుండా రూపొందించారు. భక్తులు తమ మొబైల్లో 'అన్నవరం ఫ్రీ వైఫై' నెట్వర్కు ఎంపిక చేసుకుంటే ఆటోమేటిక్గా కనెక్ట్ అయ్యే విధంగా వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా తెలిసిన వారు కూడా సులభంగా ఈ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది. దేవస్థానంలో ఇప్పటికే నగదు రహిత లావాదేవీలను విస్తృతంగా అమలు చేస్తున్నారు. అయితే కొండ ప్రాంతంలో కొన్ని సందర్భాల్లో మొబైల్ డేటా సిగ్నల్ సమస్యలు ఎదురవుతుండటంతో భక్తులు ఆన్లైన్ చెల్లింపుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఫ్రీ వైఫై సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ చర్యతో భక్తులు నగదు తీసుకువెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, వేగవంతమైన మరియు పారదర్శకమైన లావాదేవీలు నిర్వహించే అవకాశం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో దేవస్థాన పరిధిలో మరిన్ని ప్రాంతాలకు ఈ సేవలను విస్తరించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. భక్తుల సౌకర్యం, డిజిటల్ సేవల విస్తరణ, నగదు రహిత లావాదేవీల ప్రోత్సాహం అనే మూడు లక్ష్యాలతో ప్రారంభించిన 'అన్నవరం ఫ్రీ వైఫై' సేవలకు భక్తుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

# స్వర్ణాంధ్ర అధ్యాపకురాలు లావణ్యకు డాక్టరేట్



నరసాపురం, జూన్ 18 (మనం న్యూస్) : నరసాపురం మండలం సీతారామపురం గ్రామానికి చెందిన స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా సేవలందిస్తున్న నంద్యాల లావణ్య ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) సిల్చర్ లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. పరిశోధన అంశంగా పునరుత్పాదక ఇంధన వనరులు, విద్యుత్ నాణ్యత మెరుగుదల, గ్రిడ్ అనుసంధానం మరియు ఆధునిక నియంత్రణ పద్ధతులపై లావణ్య విస్తృత పరిశోధనలు నిర్వహించారు. ఈ పరిశోధనలకు సంబంధించిన పలు పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర విద్యా సంస్థల చైర్మన్ కె.వి. సత్యనారాయణ (కెవిఎస్), ట్రెజరర్ కె. వేంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రవీణ్ జైన్, దారపురెడ్డి శ్రీనివాస్ రావు, శ్రీ కైలాష్ జైన్, ఎం.వి.వి రామచంద్రరావు టి.వి.వి. ప్రసాద్, పి. వేంకటేశ్వర రావు, ఎస్. కీర్తికుమార్, ఎస్. వినయ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. గోపీచంద్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ ఎ. సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు డాక్టరేట్ పట్టా పొందిన నంద్యాల లావణ్యకు తమ అభినందనలు తెలియజేశారు.

# ఇంటర్ ఫలితాలలో శ్రీ గౌతమి విద్యార్థుల ప్రతిభ


నరసాపురం, జూన్ 18 (మనం న్యూస్) : గురువారం విడుదలైన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలలో స్థానిక శ్రీ గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులతో ప్రతిభను చాటారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో తమ కళాశాల విద్యార్థినిలు ఐతం ఉజ్వల రాణి, ఎన్. భావన నాయుడు 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ తో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించగా ఎంపీసీ జూనియర్ ఇంటర్ విభాగంలో ఎస్ హరిచరణ్ తేజ 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి టౌన్ సెకండ్ ర్యాంకును సాధించారని శ్రీ గౌతమి విద్యా సంస్థల చైర్మన్ చినమిల్లి దుర్గాప్రసాద్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పదిమందికి పైగా విద్యార్థులు 989, 985, 984 మార్కులు సాధించి తమ సంస్థతోపాటు నరసాపురం పట్టణానికి, జిల్లాకు వన్నెతెచ్చారని ఈ సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తమ విద్యార్థులను



అభినందిస్తున్నానని అన్నారు. అతి సాధారణ విద్యార్థులతో కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అత్యుత్తమ ర్యాంకులు సాధించడం తమ విద్యాసంస్థకు గర్వకారణమని దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.

ఈ విద్యా సంవత్సరం నుండి స్థానిక రుస్తుంబాద జగన్నాథస్వామి గుడి వద్ద శ్రీ గౌతమి సాయి బాలాజీ ఐటిఐ కళాశాలను ప్రారంభిస్తున్నామని ఈ కళాశాలలో ఎలక్ట్రీషియన్ విభాగంలో 80, ఫిట్టర్ విభాగంలో 40 సీట్లు ఉంటాయని దీనిలో పూర్తిస్థాయిలో ల్యాబులు, వర్క్ షాపులు అందుబాటులో ఉంటాయని శిక్షణ అనంతరం ప్లేస్మెంట్స్ కొరకు స్టీల్ ఫ్యాక్టరీతో పాటు వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు ప్రభుత్వ ఉపకార వేతనంతో పాటు హాస్టల్ వసతి కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని నరసాపురం పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమి కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రామచంద్రరావు, ప్రధానోపాధ్యాయుడు లెనిన్, సూపరింటెండెంట్ గఫార్ ఖాన్, కళాశాల అధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# బిఎల్ఓల పనితీరును పరిశీలించిన తహసీల్దార్



కాట్రేనికోన జూన్ 17 మనం ప్రతినిధిః స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (సర్ )కి సంబంధించి బిఎల్వోలు 15 వ తేదీ నుండి ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫామ్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరుగుతుంది. గురువారం నడవపల్లి పంచాయతీ నందు తహసిల్దార్ రవి కిరణ్ బి. ఎల్. ఓ ల పని తీరును క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం జరిగింది. బిఎల్ఓ లకి ఆన్లైన్ నందు 2002, 2025 ఓటర్ లిస్టు తో మ్యాపింగ్ చేయవలసి ఉన్నదని మరియు అత్యంత పారదర్శకతతో ఓటర్ లిస్టు తయారు చేయవలెనని సూచనలు జారీ చేయడమైనది.కాట్రేనికోన మండలం మొత్తం ఓటర్లు 65126 అందులో ఇప్పటివరకు 6773 ఎన్యూమరేషన్ ఫారమ్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగిందని అయన తెలిపారు. కార్యక్రమం లో బి ఎల్ ఓ డి గోపాలం, పి టి వర్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థాన లీజుల బకాయిలపై ధర్మకర్త ఆరా!

## కోట్ల ఆదాయానికి గండి కొడుతున్న బకాయిలు.. పర్యవేక్షణలో లోపాలపై విమర్శలు..

అన్నవరం, జూన్ 18, మనం న్యూస్ : అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థాన పరిధిలో లీజుల ద్వారా నిర్వహిస్తున్న వ్యాపారాల బకాయిల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దేవస్థానం కొండపై, కొండ దిగువ ప్రాంతాల్లో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న లీజుదారులు దేవస్థానానికి చెల్లించాల్సిన బకాయిల వివరాలపై వ్యవస్థాపక ధర్మకర్త సంబంధిత అధికారులను ఆరా తీసినట్లు సమాచారం. దేవస్థానానికి చెందిన షాపులు, పూల దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, ఇతర లీజు హక్కుల ద్వారా ప్రతి సంవత్సరం గణనీయమైన ఆదాయం సమకూరుతోంది. అయితే కొంతమంది లీజుదారులు నెలలు, సంవత్సరాలుగా చెల్లించాల్సిన అద్దెలు, లీజు మొత్తాలను పూర్తిగా జమ చేయకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో దేవస్థానానికి రావాల్సిన ఆదాయంపై ప్రభావం పడుతున్నట్లు



తెలుస్తోంది.

**బకాయిల జాబితాపై ఆరా...**

ప్రస్తుతం ఎవరెవరు ఎంత మొత్తంలో బకాయిలు ఉన్నారు, ఎంతకాలంగా బకాయిలు పెండింగ్లో ఉన్నాయి, వాటి వసూళ్ల కోసం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశాలపై ధర్మకర్త సి-సెక్షన్ అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని కూడా సూచించినట్లు ప్రచారం జరుగుతోంది.

**అధికారులపై విమర్శలు...**

బకాయిల వసూళ్ల విషయంలో సి-సెక్షన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది నిర్వాహకులు దేవస్థానానికి చెల్లించాల్సిన మొత్తాలను సకాలంలో చెల్లించకపోయినా కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు అయితే అధికారులను ప్రభావితం చేస్తూ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా చర్చకు దారితీశాయి.

# సీనియర్ పాత్రికేయుడు కొండేపూడి

- సత్యనారాయణ మృతి తీరనిలోటు

అమలాపురం జూన్ 17 మనం న్యూస్ః స్థానిక కామనగరువు విక్టోరియా పేటలో సవరపు నానిబాబు అధ్యక్షతన జరిగిన డా. బాబూ జగజ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆంధ్రభూమి సీనియర్ విలేకరి, ప్రస్తుత విశాలాంధ్ర పాత్రికేయులు మరియు అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కీ.శే కొండేపూడి సత్యనారాయణ మృతి పట్ల అసోసియేషన్ సభ్యులు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేసారు. ఈ సందర్భంగా మడికి శ్రీరాములు మాట్లాడుతూ కొండేపూడి సత్యనారాయణ మరణం అటు పత్రికా రంగానికి, అలాగే వారి కుటుంబానికి తీరనిలోటని తెలిపారు.ఆయన ప్రింట్ మీడియాకీ సుమారు 40 సంవత్సరాలుగా ఎనలేని సేవలు చేశారని, అలాగే గత 25 సంవత్సరాలనుండి మా డా. బాబూ జగజ్జీవన్ రామ్ ఉద్యోగుల సంఘానికి సంబందించిన వార్తలు రాసి



మా సంఘ అభివృద్ధికి ఎంతో దోహద పడ్డారని తెలియజేసారు. ఈ సమావేశంలో మడికి సత్యనారాయణ, యార్లగడ్డ రవీంద్ర, నవుండ్రు లక్ష్మణరావు , తెన్నేటి రాజబాబు, నవుండ్రు వాడపల్లి, నేదునూరి వెంకటరెడ్డి, సవరపు ప్రసాద్, నేదునూరి ప్రశాంత్ పాల్గొన్నారు

# పొంచి ఉన్న ప్రమాదం




రాజోలు, జూన్ 18 మనం న్యూస్ : రాజోలు కాటన్ పార్క్ సమీపంలో వన్ వే మార్గం జంక్షన్ లో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్ట్ ప్రమాద భరితం గా మారింది. దానికి ఉన్న నాలుగు కాళ్లు లో ఒక కాలు విరిగిపోవడం తో అది ఒక వైపు పైకి లేచిపోయి ఉంది. ఏ సమయంలో అయినా, ఈదురు గాలులకు గాని అది ఎవరి పైన అయినా పడే ప్రమాదం పొంచి ఉంది. కావున సంబందించిన అధికారులు స్పందించి దీనిని అక్కడ నుండి తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలనీ ప్రజలు కోరుతున్నారు.

# అంగన్వాడి కేంద్రాలకు చిన్నారులను పంపించండి



- అంగన్వాడి పిలుస్తుంది' కార్యక్రమంతో అవగాహన

పోడూరు జూన్ 18 మనం న్యూస్ : పోడూరు గ్రామ పరిధిలోని వెలగలమ్మ చెరువు అంగన్వాడి కేంద్రంలో సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసీడీఎస్) బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సీడీపీవో) ఆదేశాల మేరకు 'అంగన్వాడి పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్నారులందరినీ తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో ఆటలు, పాటలు, వినోదాత్మక బోధన విధానాల ద్వారా చిన్నారులకు విద్యను అందించడంతో పాటు వారి మానసిక, శారీరక, సామాజిక వికాసానికి తోడ్పాటు అందిస్తారని వివరించారు. చిన్నారుల్లో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో అంగన్వాడి కేంద్రాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. 'అంగన్వాడి పిలుస్తుంది' కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ సేవలు, బాలల సమగ్ర అభివృద్ధి అంశాలపై వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకురాలు హసీనా, అంగన్వాడి కార్యకర్త సురేఖ, అంగన్వాడి సహాయకురాలు నాగమణి పాల్గొన్నారు.

# విద్యార్థులకు భావితరాల భవిష్యత్తు రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యం

## ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్

శంఖవరం జూన్ 18 మనం ప్రతినిధి:-= విద్యార్థులకు భావితరాల భవిష్యత్తు, నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'అమలు చేస్తున్న 'శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర' కార్యక్రమంలో భాగంగా శంఖవరం మండలం వజ్రకూటం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో నూతన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వజ్రకూటం మాజీ సర్పంచ్, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్యపుస్తకాలను అందించడం అభినందనీయమని అన్నారు. పుస్తకాలు విద్యార్థులకు జ్ఞాన ద్వారాలను తెరుస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన అన్ని విద్యా సదుపాయాలను ప్రభుత్వం అందిస్తున్నదని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యతను వివరించి, విద్యపై మరింత ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




# క్రైస్తవులందరికీ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది




- ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం జూన్ 17 మనం న్యూస్ : అమలాపురం కరక్కాయ పేట చర్చిలో నిర్వహించిన జిల్లాస్థాయి పాస్టర్ల సమావేశంలో శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రైస్తవులందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. క్రైస్తవ మైనారిటీల సంక్షేమానికి, వారి ప్రార్థనా మందిరాల రక్షణకు, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇటీవల అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికపై క్రైస్తవ సోదరుల సంక్షేమం, వారి అవసరాల గురించి బలంగా మాట్లాడినందుకు గాను జిల్లాస్థాయి పాస్టర్లందరూ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవ సమాజం పట్ల ఆయనకున్న ఆత్మీయతను, చిత్తశుద్ధిని కొనియాడుతూ పాస్టర్లు అందరూ కలిసి ఎమ్మెల్యే ని శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ పరిధిలోని వివిధ చర్చిల పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు, మరియు కూటమి పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాల అందజేత

## గత 20 ఏళ్లుగా అందిస్తున్న విద్యదాత కర్రి శ్రీనివాస్



ముమ్మిడివరం, జూన్ 18 మనం ప్రతినిధిః కర్రి శ్రీనివాస్ విద్యా సేవ సమితి అధ్యక్షుడు కర్రి శ్రీనివాస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ఎందరో పేద విద్యార్థులకు అండగ ఉంటున్నారు. కాట్రేనికోన మండలం నడవపల్లిలోని పల్లిపాలెం గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాస్ చదువుకునే వారంటే చాలా ఇష్టం. ఆయన కూడా తాను చదువుకునే రోజుల్లో ఎన్నో కష్టాలు అనుభవించారు. తనలా పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఎవరు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు అండగా ఉంటున్నారు. గత 20 ఏళ్లుగా ప్రతి ఏడాది జూన్ 15న తన పుట్టిన రోజును పురస్కరించుకుని వందలాది మంది పిల్లలకు నోటు పుస్తకాలను అందజేస్తున్నారు. కుంచనపల్లి, పల్లిపాలెం, పల్లంకుర్రు, కుండలేశ్వరం, నడవపల్లి, లచ్చిరాజుచెరువు, వెంకమ్మచెరువు, కొప్పిగుంట, తదితర ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ప్రతి ఏడాది నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, అరెజేర్లు ఉచితంగా అందిస్తున్నారు. గతేడాది 650 మంది పిల్లలకు పుస్తకాలు అందించగా ఈ ఏడాది ఇంతవరకు 450 మంది వరకు పుస్తకాలు అందజేసారు. దీనిలో భాగంగా గురువారం నడవపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 65 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను శ్రీనివాస్ సోదరుడు రామకృష్ణ చేతుల మీదుగా అందించారు. పాఠశాలల్లో చదువుకుంటున్న పిల్లలకు తన వంతుగా ఏదైన చేయాలనే ఆలోచనతోనే గత 20 ఏళ్లుగా విద్యార్థులకు పుస్తకాలు, విద్య సామాగ్రి అందిస్తున్నాను అని దాత కర్రి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు కొనియాడారు. గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు ఆయన అండగా ఉండటం ఎంతో అభినందనీయమన్నారు. హెచ్ ఎం సుందరరావు, నరసింహమూర్తి, ఉపాధ్యాయులు , విద్యారులు పాల్గొన్నారు.

## మారెన్న భౌతికకాయాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నేత



మంత్రాలయం , జూన్ 18,మనం న్యూస్: కౌతాళం మండల పరిధిలోని నదిచాగి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు పోస్ట్ మారెన్న బుధవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని మారెన్న మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులకు రాంపురం రెడ్డి సోదరులు కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు రామన్న గౌడ్, మాజీ ఎంపీటీసీలు కే.ఈశప్ప గౌడ్ టీ.లింగన్న గౌడ్. మరియు నాయకులు కార్యకర్తలు కూడా ఉన్నారు.

## గొడ్డలి పార్టీకి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం

**రెండేళ్ల లో రూ 488.62 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం అభివృద్ధికి దాదాపు రూ 350 కోట్లు -సంక్షేమానికి రూ 138.62 కోట్లు**

**బీసీలు అంత ఐక్యమత్యంతో ఉండాలి.**

**ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ**

**ప్రతి టిడిపి కార్యకర్తకు అండగా ఉంటా**

**మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి**



మంత్రాలయం , జూన్ 18,మనం న్యూస్ ;- గొడ్డలి పార్టీకి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పడం జరుగుతుందని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విజయోత్సవ సభను ఏర్పాటు చేశారు. అంతకు ముందు టిడిపి పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో మంత్రాలయం నియోజకవర్గం లో రూ .కోట్ల రూపాయలు నిధులు తెచ్చి ఎన్నో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు గ్రామాలలో సిసి రోడ్లు తాగునీటి వంటి పథకాలు తీసుకురావడం జరిగిందన్నారు. అభివృద్ధి అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఒక్క సీసీ రోడ్డు అయినా వేశావని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పై ధ్వజమెత్తారు. బీసీల మధ్య ,ఎస్సీల మధ్య గొడవలు సృష్టించి దాడులకు పాల్పడ్డారని దుయ్యబడ్డారు. రాంపురంకు దగ్గరలో ఉన్న ఎనిమిది గ్రామాలలో ప్రజాస్వామ్యం లేకుండా వాళ్లను పీడించి నియంత్రణ పాలన చేస్తూ వారిని నిత్యం వేధిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ పబ్బం గడుపుకుంటున్నావు నీవు కాదా అని విమర్శించారు. బీసీలంత ఐక్యమత్యంతో ఉండే రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో తెదేపా పార్టీ అభ్యర్థులను గెలిపించుకొనందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు.

## తెదేపా నేతల మోటార్ బైక్ ర్యాలీ



ఎమ్మిగనూరు జూన్ 18 మనం న్యూస్ పట్టణంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగాఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అన్నమయ్య సర్కిల్, శివ సర్కిల్, సోమప్ప సర్కిల్, శ్రీనివాస టాకీస్ సర్కిల్, మార్కెట్ యార్డ్ సర్కిల్, ఓం శాంతి సర్కిల్, స్టేట్ బ్యాంక్ సర్కిల్ మీదుగా కుర్నీ కళ్యాణ మండపం వరకు భారీ ఎత్తున ర్యాలీ సాగింది. అనంతరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె కృష్ణమ్మ గారు, నియోజకవర్గ పరిశీలకులు ముని శేఖర్ రెడ్డి గారు, పట్టణ బూత్ పరిశీలకులు పోతురాజు రవికుమార్ గారు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తొగట నరసింహులు గారు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి రేఖా గౌడ్ గార్లతో కలిసి ఎమ్మెల్యే బి.వి. మూడు పార్టీల జెండాలను ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి 'మా తెలుగు తల్లి' ప్రార్థనా గీతంతో సభను ప్రారంభించారు గురజాలకు చెందిన ఎస్సీ నాయకులు పెద్ద కిషన్ గారి మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందని పేర్కొన్నారు.

## మండలంలో జనసేన జెండా ఎగరవేసిన రేఖ గౌడ్



నందవరం జూన్ 18 మనం న్యూస్: నందవరం మండలంలోని జనసేన మండల అధ్యక్షులు ఎల్లప్ప ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు ఇన్చార్జి రేఖ గౌడ్ నందవరం మండలంలో జనసేన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నందవరం హెడ్ క్వార్టర్ లో జనసేన జెండా ఎగురవేశారు జనసేన శ్రీశైలం దేవ స్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ మరియు ఎమ్మిగనూరు ఇన్చార్జి రేఖ గౌడ్ మాట్లాడుతూ నందవరం మండలంలోని జనసేన జెండా ఎగరవేయడం చాలా సంతోషంగా ఉందని అదేవిధంగా రేపు జరగబోయే సర్పంచ్ ఎలక్షన్ గాని ఎంపిటిసి ఎలక్షన్ గాని గట్టిగా పోటీ చేసి ముందుకు సాగాలని తెలియజేశారు.గత ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ శాఖ దేశంలో 24వ స్థానంలో ఉండేది.దానిని కేవలము రెండు సంవత్సరాలలోనే ఏపీ పంచాయతీ రాజ్ శాఖను మొదటి స్థానంలో నిలిపిన ఘనత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి దక్కుతుంది అని తెలియచేశారు.కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి సహకారంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి తోడ్పాటు తో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి హామీల అమలు విషయంలో ముందుకు దూసుకెళ్తుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు చంద్ర, అంజి, బంగారి, అదిల్, ఇర్ఫాన్, తిమ్మప్ప, రామాంజినేయులు, రామలింగడు, ఉపేంద్ర, ఇసాక్, రాముడు, చిన్న ఈరన్న, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## గోశాల యాగశాల వశిష్ఠ మహర్షి శిల శాసనాలు ఆది ధర్మం గ్రంథం ఆవిష్కరణ

కర్నూలు జూన్ 18మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రాయచోటి లక్కిరెడ్డి పల్లె శ్రీ మాతంగ మహాపీఠం మొదటి వార్షికోత్సవం సందర్భంగా అంగ రంగ వైభవంగా అత్యాధ్మిక శాల గోశాల యాగశాల వశిష్ఠ మహర్షి శిల శాసనాలు ఏర్పాటు చేసిన అనంతరం ఆది జాంబవుడు ఆది ధర్మం గ్రంథ పుస్తక ఆవిష్కరణ జగత్ గురువు శ్రీ స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి, శ్రీ మాతంగ మహాపీఠాధిపతి శ్రీ మాతంగ నందగిరి స్వామి, పూర్ణనాథస్వామి, మాన్యశ్రీ గౌరవ కె హెచ్ మునియప్ప ఆహార, పౌరసరఫరాల శాఖమంత్రి వర్యులు మరియు కర్ణాటక ఆంధ్రప్రదేశ్ తెలంగాణ గురు స్వాముల సమక్షంలో గ్రంధ పుస్తక ఆవిష్కరణ చేసిన అనంతరం జగత్ గురువు శ్రీ స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి మాట్లాడుతూ సృష్టికి మూలం మాదిగ మహనీయులని చెప్పుతూ ఆది



పురుషుడైన ఆది జాంబవుని వారసులు మాదిగలని భూమి ఆరు నెలలు ముందు పుట్టినవాడు ఆది జాంబవుడు సృష్టిని ప్రకృతి లోని పంచ భూతాలను పుట్టించి జాంబవుని ఆధీనములో సృష్టి నిర్మాణ ప్రయాణం కొనసాగుతున్నదని, నవగ్రహాలు కూడ ఆది జాంబవుని నియంత్రణలో ఉంటాయని అన్నారు. ఆది జాంబవుడు చిరంజీవి, అతడు ఏడేడు పద్నాలుగు లోకాలు ఏలుతున్నాడని సందేశం ఇచ్చారు.

## 4 సంవత్సరాలుగా గైర్హాజరు




- **ఉపాధ్యాయురాల కు నోటీసులు జారీ చేసిన ఎంఈఓలు**

కౌతాళం,జూన్ 18 మనం న్యూస్: కౌతాళం పొదలకుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సుభాషిణి నాలుగు సంవత్సరాలుగా విధులకు హాజరు కావడం లేదు. ఉపాధ్యాయురాలుపై శాఖాపర మైన చర్యలకు డీఈఓ దృష్టికి తీసుకెళ్లి నోటీ సులు జారీ చేసినట్లు ఎంఈఓ-1,2 రామాంజినేయులు, శోభారాణి గురువారం విలేకరులకు తెలిపారు.కర్నూలుకు చెందిన సుభాషిణి 2016 జూన్ లో విధుల్లో చేరారని, 2022 మార్చి నుంచి గైర్హాజర వుతున్నారన్నారు. షోకాజ్ నోటీసులు,మెమోలు పోస్ట్ ద్వారా ఆమే ఇం టికి పంపినా ఎలాంటి సమాధానం రాలేదని తెలిపారు. విద్యాశాఖాధికారులకు నివేదిక చేయని పక్షంలో ప్రభుత్వ నియామవళి ప్రకా రంగా శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎంఈఓలు చెప్పారు.

## రాయదుర్గం టెక్స్ టైల్ పార్క్‌కు సంబంధించి జిల్లా స్థాయి సమావేశం నిర్వహణ

అనంతపురం, కలెక్టరేట్ జూన్ 18 : మనం న్యూస్ : అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం రాయదుర్గం టెక్స్ టైల్ పార్క్ కు సంబంధించి నాలుగవ జిల్లా స్థాయి సమావేశం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాయదుర్గం టెక్స్ టైల్ పార్క్ లో ఇప్పటి వరకు యూనిట్ల స్థాపన కొరకు ప్రయత్నించని యూనిట్ దారులకు చివరిసారిగా నోటీసులను జారీ చేయాలని, స్పందించని వారికి కేటాయించిన ప్లాట్లను రద్దుచేసి ఇంకెవరైనా యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చిన వారికి కేటాయించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి రాబోయే జిల్లా స్థాయి సమావేశములో సమర్పించాలని జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా



ఆహుడా కార్యాలయములో ఏవైనా అనుమతులు కావలసిఉన్నా ఆహుడా అధికారులతో స్వయంగా చర్చించి త్వరితగతిన అనుమతులు ఇప్పించాలని జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి వరప్రసాద్, టెక్స్ టైల్ పార్క్ యూనిట్ దారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే..



సి.బెళగల్ జూన్ 18 మనం న్యూస్: సి బెళగల్ మండల కేంద్రంలో గురువారం నాడు ఐసిడిఎస్ సూపర్వైజర్ జరీనా భాను మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు తమ పిల్లలను వంపించి పోషకాలతో కూడిన ఆహారంతో పాటు చదువుకు అవసరమైన పునాదివేసేందుకు ప్రతి తల్లి తమ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు గురువారంనాడు కోడుమూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సి బెళగల్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు సంబందించి సి బెళగల్ సెక్టర్ సూపర్వైజర్ జరినా భాను ఆదేశాలతో పిల్లలకు స్థానిక 4వ అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు.. పిల్లలకు అంగన్వాడీకేంద్రం నుంచి ఆయా లబ్ధిదారులకు, వారి పిల్లలను సమావేశ పరిచి గత సంవత్సరంలో పిల్లలు అంగన్వాడీ కేంద్రంలోఏమి నేర్చుకున్నారో.. వారి పెరుగుదలకు ఎలా సహాయ పడింది.. అనే విషయం కోసం ఆయా పిల్లల యొక్క భవిష్యత్తుకుఉపయోగపడుతుందని పిల్లల తల్లులతో మాట్లాడారు.

## శ్రీ మఠంలో వైకాపా సీనియర్ నేత సీతారామిరెడ్డి



మంత్రాలయం , జూన్ 18,మనం న్యూస్ ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వైఎస్సార్ సీపీ కార్యనిర్వాహక సభ్యులు పత్తికొండ అసెంబ్లీ పరిశీలకులు వై.సీతారామిరెడ్డి గురువారం వచ్చారు. వీరికి వైకాపా నాయకులు స్వాగతం పలికారు. వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి , మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. వారి వెంట మఠం సూపరింటెండెంట్ పురాణిక్ రాఘవేంద్ర , వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## మామిడి రైతుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం..

- **ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు సంఘం**




తిరుపతి, జూన్ 18 మనం న్యూస్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు సంఘం సమావేశం గురువారం రైతు సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు గంగారపు మునిరత్నం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మామిడి రైతులు, కౌలు రైతులు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.సమావేశం అభిప్రాయపడింది ఏమనగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, కూలీల వేతనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు, రవాణా వ్యయాలు రైతులపై భారీ భారం మోపుతున్నాయి. మరోవైపు మామిడి ధరలు పతనమవడంతో రైతులు తీవ్రమైన నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తోతాపురి మామిడికి టన్నుకు రూ18,000 గిట్టుబాటు ధర ప్రకటించాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద టన్ను మామిడికి రూ6,000 ఆర్థిక సహాయం అందించాలని కోరింది. ప్రభుత్వం ప్రకటించిన సహాయం పూర్తిస్థాయిలో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. మామిడి రైతులు ప్రతి సంవత్సరం ధరల అస్థిరత, మధ్యవర్తుల దోపిడీ, ప్రాసెసింగ్ పరిశ్రమల ఏకపక్ష కొనుగోలు విధానాల వల్ల నష్టపోతున్నారని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది.

## సస్యరక్షణే మొక్కకు ప్రాణ రక్షా

- **'రైతులకు విత్తన శుద్ధి ఆవశ్యకతపై అవగాహన కల్పించిన ఏవో**



తుగ్గలి జూన్ 18(మనం న్యూస్ ): పంటల సాగుకు ముందు రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఏవో సిహెచ్ సురేష్ బాబు అన్నారు.గురువారం తుగ్గలి పొలాలను సందర్శించి రైతులకు విత్తన శుద్ధి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ విత్తనాలను క్లోరోపైరిఫాస్తో శుద్ధి చేయడం ద్వారా ప్రారంభ దశలో ఆశించే పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చని తెలిపారు. నాణ్యమైన దిగుబడుల కోసం విత్తన ఎంపికతో పాటు విత్తన శుద్ధి, పంట యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని ఏవో సురేష్ బాబు సూచించారు.రైతులు కందితో పాటు మిశ్రమ పంటలు వెయ్యాలని ఏవో కోరారు.

## ముత్యాలమ్మపల్లిలో బర్తాన్ బ్యాంక్ శాఖ ప్రారంభం

**జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా ప్రారంభోత్సవం**

**గ్రామీణ ప్రాంతాలకు చేరువలో బ్యాంకింగ్ సేవలు... ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్**

**చిన్న వ్యాపారులు, రైతుల ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు దోహదం చేస్తాయి: పరిటాల సునీత**

శ్రీ సత్య సాయి జిల్లా జూన్ 18మనం న్యూస్ : రామగిరి మండలం ముత్యాలమ్మపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బర్తాన్ బ్యాంక్ శాఖను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ రాష్ట్ర నాయకులు పరిటాల శ్రీరామ్ గురువారం ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి శాఖను ప్రారంభించిన అనంతరం వారు బ్యాంకు సేవలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావడం అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువత బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వినియోగదారులకు పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించాలని బ్యాంకు నిర్వాహకులకు సూచించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సదుపాయాల విస్తరణ ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాలకు నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు, చిన్న వ్యాపారులు బ్యాంకుల ద్వారా లభించే రుణాలు, ఆర్థిక సేవలను వినియోగించుకుని తమ జీవనోపాధిని మరింత మెరుగుపర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్, డీఆర్డీఏ పీడీ నరసయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, బ్యాంకు సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




## గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించండి



- **శంఖవరం మండల అధ్యక్షుడు పర్వత రాజబాబు..**

శంఖవరం జూన్ 18 మనం ప్రతినిధి : శంఖవరం మండలంలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యల పై అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో ఎంపీపి పర్వత రాజబాబు ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ సర్వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ ప్రగతిని వివరించడంలో భాగంగా మండల వైద్యాధికారి ఎస్ఎస్ రాజీవ్ మాట్లాడుతూ ఈ నెల 21న జరుగనున్న పల్స్ పోలియో విజయవంతానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని, మండలంలో 0 నుండి 5ఏళ్ళ లోపు వయస్సు గల పిల్లలు 4503 మంది ఉన్నారని, వీరి కోసం 63 బూత్ లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు తెరవనున్నందున ముందస్తుగా పంచాయతీ సిబ్బంది సహకారంతో శానిటేషన్ పూర్తి చేసామన్నారు. ఆర్ డబ్ల్యుఎస్ ఏఇ మారుతీ రామ్ జల జీవన్ మిషన్ పథకంపై వివరిస్తుండగా ఎంపీపి రాజబాబు మాట్లాడుతూ మండపం, కొంతంగి, కత్తిపూడి, సీతంపేట గ్రామాల్లో వాటర్ ట్యాంకులకు పైపులైన్ వేయకపోడవం వల్ల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని, వీటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. తహశీల్దార్ సూరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలకు, అధికారులకు ముఖ్యమైనది ఎస్ఐఆర్ అని, దీనికి ఎన్యూమరేషన్ ధరఖాస్తుతో పాటు ఇటీవలే తీయించిన కలర్ ఫొటోను, ఆధార్, ఓటర్ ఐడిని ప్రతీ ఒక్కరు సమర్పించాలని, దీనికి ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. రీ సర్వేలోనూ కొన్ని గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని, వాటిని సత్వర పరిష్కారానికి తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతిని వివరించారు. సమావేశం అనంతరం ఎంపిటిసిలు గడిచిన రెండేళ్ళుగా తమకు గౌరవ వేతనం ఇవ్వడం లేదని, తక్షణమే వచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు ధారా వెంకటరమణ, ఈగల చిన్నమ్ములు, డిప్యూటి ఎంపిడిఓలు పుష్యమి కీర్తి, నాగలక్ష్మి, మండల విద్యాశాఖాధికారి ఎస్వీ రమణ, వెటర్నరీ వైద్యురాలు లావణ్య, వెలుగు ఏపిఎమ్ శ్రీనివాస్, ఏఇఓ శ్రీనివాస్, ఉపాధి ఏపిఓ శ్రీనివాసరావు, విధ్యుత్ ఏఇ భగతీకుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ బివి రజనీ, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## వేళంగిలో ఓటర్ల జాబితాపై క్షేత్రస్థాయిలో పరిశీలన



శంఖవరం జూన్ 18 మనం ప్రతినిధిః ప్రజలు ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగి ఉండాలని శంఖవరం మండల తహసిల్దార్ ఎం సూరిబాబు అన్నారు. శంఖవరం, మండలం లోని వేలంగి గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్యూమరేషన్ ఫారమ్ (ఇఎఫ్ ) పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎం. సూరిబాబు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల అమలును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎలీలు) ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించిన తహసీల్దార్, ప్రతి అర్హుడైన ఓటరుకు ఫారాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ చేసిన ఫారాలను నిర్ణీత గడువులోపు సేకరించి, వాటిలో పొందుపరిచిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని ఆదేశించారు.ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాను మరింత సమగ్రంగా, తప్పులులేని విధంగా రూపొందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఎలు పాల్గొన్నారు.

## పారిశ్రామిక ఎగుమతులను ప్రోత్సాహించాలి



అనంతపురం, కలెక్టరేట్ జూన్ 18 : మనం న్యూస్ జిల్లాలో పారిశ్రామిక ఎగుమతులను ప్రోత్సాహించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో 69వ జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ మరియు ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా అన్ని శాఖల వారు ప్రోత్సహించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి వాతావరణం కలగజేయాలన్నారు. పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు అందజేసేలా చూడాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టము చేసేలా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను అందజేసి పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపిఐఐసి పారిశ్రామికవాడలలో వివిధ దశలలో వున్న పరిశ్రమల ఉత్పత్తిని వేగవంతం చేయలని జెడ్ఎంని ఆదేశించారు. ఇంకా ఉత్పత్తి ప్రారంభించని యూనిట్లను వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఏపిఐఐసి జెడ్ఎంని ఆదేశించారు. జిల్లాలో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీలో 1 యూనిట్లకుగాను విద్యుత్ రాయితీ ఒక లక్ష 93 వేల 349 రూపాయలు, పెట్టుబడి రాయితీ కింద 9 యూనిట్లకుగాను 57 లక్షల 51 వేల 712 రూపాయలు సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు.

## 126 బంతుల్లోనే 306 రన్స్.. బిహార్ నుంచి మరో క్రికెట్ సంచలనం

వైభవ్ సూర్యవంశీ 13 ఏళ్లకే ఐపీఎల్ కాంట్రాక్ట్ దక్కించుకుని క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశాడు. బిహార్ కు చెందిన ఈ కుర్రాడు రాజస్థాన్ రాయల్స్ తరపున గత రెండు సీజన్లలో పరుగుల వరద పారించి ఎన్నో రికార్డులు బ్రేక్ చేశాడు. ఈ ప్రదర్శనతో భారత టీ20 జట్టులోనూ చోటు సంపాదించుకున్నాడు. ఇప్పుడు అదే రాష్ట్రం నుంచి మరో టీనేజీ సంచలనం వెలుగులోకి వచ్చింది. అక్షర గుప్తా అనే అమ్మాయి ఓ మ్యాచ్ లో 126 బంతుల్లోనే 242.86 స్ట్రైక్ రేట్ తో 306 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ, 34 బంతుల్లో సెంచరీ చేసింది. మొత్తం 55 ఫోర్లు, ఎనిమిది సిక్సర్లు బాది వార్తల్లో నిలిచింది.

బిహార్ క్రికెట్ అసోసియేషన్ మహిళల అండర్-19 వన్డే ట్రోఫీ టోర్నమెంట్ లో అక్షర గుప్తా ఈ సంచలన ఇన్నింగ్స్ నమోదు చేసింది. 15 ఏళ్ల అక్షర తూర్పు చంపారన్ జిల్లా రక్సాల్ అనే పట్టణంలో పుట్టి పెరిగింది. 14 ఏళ్ల వయసులోనే అండర్-19 మహిళల జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించింది. బిహార్ తరపున రెండేళ్ల వ్యవధిలో వరుసగా నాలుగు బీసీసీఐ మహిళా టోర్నమెంట్లు ఆడిన తొలి మహిళా క్రికెటర్ గా నిలిచింది.

సంచలన ఇన్నింగ్స్ ఆడిన అక్షరకు బిహార్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్ అభినందనలు తెలిపారు. బిహార్ మహిళా క్రికెటర్లు తమ ప్రదర్శనల ద్వారా రాష్ట్రానికి నిరంతరం కీర్తిని తెస్తున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు బీసీఏ నిరంతరం కృషి చేస్తోందని, ఇలాంటి ఇన్నింగ్స్లు యువ క్రికెటర్లకు స్ఫూర్తినిస్తాయన్నారు.







### 3 వారాలు.. 3 ఫార్మాట్లు.. 3 సెంచరీలు..

# దటీజ్ 'కెప్టెన్' గిల్!

**అప్పటివరకు దంచికొట్టిన టీ20లు.. వారానికే టెస్టు మ్యాచ్ లోకి ఎంట్రీ.. ఆపై మరికొద్ది రోజులకే 50 ఓవర్ల క్రికెట్... సుమారుగా ఇరవై రోజుల వ్యవధిలో కెప్టెన్ శుభ్ మన్ గిల్ మూడు ఫార్మాట్లనూ ఆడిన వైనం.. ప్రతి ఫార్మాట్ లోనూ 'కెప్టెన్' సెంచరీతో మెరవడం గమనార్హం. మూడు వారాల్లో టీ20, టెస్టు, వన్డే మ్యాచుల్లో సెంచరీ చేసి ఔరా అనిపించాడు. గిల్ ఇన్నింగ్స్ పై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా సర్ ప్రైజ్ అయ్యారంటే.. అతడి ఆటతీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.**

**ఎప్పుడెప్పుడు కొట్టాడంటే..**

మే 29న ఐపీఎల్ లో గుజరాత్ టైటాన్స్ రెండో క్వాలిఫయర్ మ్యాచ్ ను ఆడింది. జీటీ కెప్టెన్ అయిన శుభ్ మన్ గిల్ అద్భుత శతక ఇన్నింగ్స్ తో ఆకట్టుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ పై గిల్ 104 పరుగులు చేశాడు.

అఫ్గానిస్థాన్ తో జూన్ 6న భారత్ ఏకైక టెస్టు మ్యాచ్ ఆడింది. తొలుత టీమ్ఇండియా 564 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ గిల్ (126)తోపాటు కేఎల్ రాహుల్ (100) సెంచరీలతో మెరిశారు. మూడు రోజుల్లోనే ముగిసిన మ్యాచ్ లో భారత్ ఘన విజయం సాధించింది.

అఫ్గానిస్థాన్ తో రెండో వన్డేలో కెప్టెన్ శుభ్ మన్ గిల్ (154) సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. గిల్తో పాటు ఇషాన్ కిషన్ (125) కూడా సెంచరీ బాదాడు. దీంతో భారత్ 402 పరుగుల భారీస్కోరు చేసింది. అనంతరం అఫ్గాన్ 232 పరుగులకే ఆలౌటైంది.

మూడు మ్యాచుల్లోనూ ఆయా జట్లకు శుభ్ మన్ గిల్ కెప్టెన్ కావడం విశేషం.

**ఇలా మారడం చాలా కష్టమే..**

దాదాపు రెండు నెలలపాటు టీ20 క్రికెట్ ఆడిన తర్వాత టెస్టులను ఎదుర్కోవడం ఎంతటి క్రికెటర్ కైనా కష్టమే. అఫ్గాన్ మనకంటే కాస్త చిన్న జట్టు అయినా సరే.. తక్కువగా అంచనా వేయడానికి వీల్లేని పరిస్థితి. కానీ, శుభ్ మన్ గిల్ మాత్రం అలవోకగా ట్రాన్స్ ఫామ్ అయిపోయాడు. టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత.. వారం రోజులకే వన్డే సిరీస్ లో భారత్ తలపడుతోంది. ఇక్కడ టెస్టుల్లో ఆడినట్లు నెమ్మదిగా ఉండటం కుదరదు. అలాగని టీ20ల్లో మాదిరిగా దూకుడుగా ఆడలేం. రెండింటినీ మేళవించి మంచి ఇన్నింగ్స్ ఆడాలి. రెండో వన్డేలో గిల్ అదే చేసి చూపించాడు. మొన్నటి వరకూ అతడి ఫామ్, ఆటతీరుపై కాస్త సందేహపడిన వారికి ఇప్పుడీ ప్రదర్శనతో సమాధానం ఇచ్చినట్లైంది. అఫ్గాన్ తో వన్డే సిరీస్ అనంతరం టీమ్ఇండియా ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లనుంది. ఆ రెండు సిరీస్ లకూ గిల్ ఎంపిక కాలేదు. ప్రస్తుత ఆటతీరుతో అతడికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్లు వచ్చినా ఆశ్చర్యపోనవసరంలేదు.

*కెప్టెన్ గా బాధ్యతలు నిర్వర్తిస్తూ.. బ్యాటర్ గా అద్భుత ప్రదర్శన చేయడం బాగుంది. ఒక జట్టుకు నాయకత్వం వహించడమనేది ఒక ఆటగాడిలోని సత్తాను బయటకు తీసుకొస్తుంది. అదృష్టవశాత్తూ గిల్ లోని అత్యుత్తమ ప్రతిభను వెలికితీసింది. బాగా పరుగులు చేయలేనప్పుడు కెప్టెన్ గా మంచి నిర్ణయాలు తీసుకోవడమూ కష్టంగా మారుతుంది. అప్పుడు ఇటు ఆటగాడిగా.. అటు సారథిగా విమర్శలు తప్పవు. అదే, వ్యక్తిగతంగా మంచి ఆటతీరు ప్రదర్శిస్తే.. నిర్భయంగా నిర్ణయం తీసుకోగలరు*

**- సునీల్ గావస్కర్**

## 'దురంధర్ స్క్రిప్ట్ అక్కడి నుంచే'.. రాకేశ్ బేడీ స్ట్రాంగ్ కౌంటర్..!

రణ్ వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ దురంధర్. గతేడాది డిసెంబర్ లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ ను షేక్ చేసింది. పాకిస్తాన్ నేపథ్యంలో వచ్చిన ఈ మూవీకి ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పార్ట్-1 బ్లాక్ బస్టర్ కావడంతో మేకర్స్ మూడు నెలల గ్యాప్ లోనే సీక్వెల్ కూడా రిలీజ్ చేశారు. ఈ రెండు పార్టులు కలిసి బాక్సాఫీస్ వద్ద రూ.3 వేల కోట్ల మార్క్ దాటేశాయి. ఈ వసూళ్లతో ఇండియన్ సినిమా చరిత్రలోనే సరికొత్త రికార్డ్ సృష్టించాయి.

అయితే ఈ మూవీపై మొదటి నుంచే విమర్శలు వస్తూనే ఉన్నాయి. ఇదొక ప్రాపగండ ఫిల్మ్ అనే ముద్ర వేశారు. అయినప్పటికీ వసూళ్ల పరంగా ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. అంతేకాకుండా పార్ట్-1 రిలీజ్ తర్వాత ప్రాపగండ ముద్రవేసిన కొందరు.. ఈ మూవీకి స్క్రిప్ట్ పీఎంవో ఆఫీస్ నుంచి వచ్చిందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా



దురంధర్ నటుడు రాకేశ్ బేడీ స్పందించారు. అలాంటిదేం లేదని ఆయన ఖండించారు. ఢిల్లీలో జరిగిన అమృత్ రత్న 2026 సదస్సులో పాల్గొన్న రాకేశ్ బేడీ విమర్శించేవారికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

రాకేశ్ బేడీ మాట్లాడుతూ..'ఈ సినిమా హిట్టయ్యాక ధురందర్ స్క్రిప్ట్ నేరుగా ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) నుంచి రాశారని కొందరు అన్నారు. అలాంటి స్టోరీ రాయగల వ్యక్తి పీఎంఓలో ఎవరున్నారో చెప్పండని నేను అడిగా. అలాంటి ఆలోచన కూడా ఎవరికీ రాదు. ఈ సినిమాలో నేను చెప్పిన డైలాగులు ఎవరైనా రాయగలరా? అసలు అక్కడ ఉన్నవాళ్లు ఇలాంటి డైలాగుల గురించి ఆలోచన చేయగలరా? అని వాళ్లను ప్రశ్నించా' అని తెలిపారు.

కాగా.. ఈ స్పై యాక్షన్ మూవీలో రాకేశ్ బేడీ కీలక పాత్రలో మెప్పించారు. జమీల్ జమాలీగా పాకిస్థాన్ రాజకీయ నాయకుడి పాత్రలో అదరగొట్టేశారు. ఈ చిత్రాలకు ఆదిత్య ధర్ దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సారా అర్జున్ హీరోయిన్ గా కనిపించింది. ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, గౌరవ్ గెరా, ష్ పాండోర్ కీలక పాత్రల్లో నటించారు.




## 'భోగి'లో శర్వా పర్ఫార్మెన్స్.. నెక్స్ట్ లెవెల్ అంటున్న సంపత్ నంది..!

చార్మింగ్ స్టార్ శర్వానంద్, దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్ లో వస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'భోగి' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. పూర్తి యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కాగా ఈ చిత్ర సెట్స్ నుండి ఒక ఆసక్తికరమైన అప్ డేట్ వచ్చింది. షూటింగ్ లో శర్వానంద్ పండించిన ఒక ఎమోషనల్ సీన్ చూసి తాను కట్ చెప్పడం కూడా మర్చిపోయానని దర్శకుడు సంపత్ నంది సోషల్ మీడియా వేదికగా తెలిపాడు.

గత దశాబ్ద కాలంలో శర్వానంద్ ఇచ్చిన బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇదేనని ఆయన కొనియాడాడు. ఆ సీన్ ముగియగానే సెట్స్లో ఉన్న 200 మందికి పైగా యూనిట్ సభ్యులు చప్పట్లు కొడుతూ, కళ్ల నీళ్లు తుడుచుకున్నారని సంపత్ నంది పేర్కొన్నాడు. తన కెరీర్ లో ఇలాంటి అనుభూతి కలగడం ఇదే మొదటిసారని తెలిపాడు.

ఇప్పుడు తాను చెప్పిన మాటలు గుర్తుపెట్టుకోవాలని.. థియేటర్లలో 'భోగి' చూస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా కచ్చితంగా ఇదే ఎమోషన్ కు గురవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశాడు. ఇక ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.



## ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేసే ఫన్నీ అలవాటు..

**'మా ఇంటి బంగారం' ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని అంటున్నారు సమంత. ఆమె కథానాయికగా నందినీరెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా సామ్ అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.**

**ఈ మూవీ ఎందుకు చూడాలి? కారణం చెబితే టికెట్ బుక్ చేసుకుంటా!**

సమంత: ఎంతో నిజాతీయగా ఈ మూవీ తీశాం. మీకు కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నా. ప్రతి ఒక్కరూ ప్రేమించే చిత్రమవుతుంది.

**ఈ మూవీ మీకు వ్యక్తిగతంగా ఎందుకంత ప్రత్యేకమైంది?**

ఎందుకంటే.. ఇది నా నిజమైన వ్యక్తిత్వానికి దగ్గరగా ఉంటుంది. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలన్నింటిలోకి ఇందులో చేసిన స్వర్ణ పాత్ర అంటే ఎంతో ఇష్టం.

**ఏ భారతీయ నటిని మీరు ఆదర్శంగా తీసుకుంటారు? ఆమె నుంచి పొందే స్ఫూర్తి ఏంటి?**

ఉన్న చోటే ఆగిపోకుండా వృత్తి, వ్యక్తిగత అభివృద్ధి చెందుతున్న ప్రతి ఒక్కరూ నాకు స్ఫూర్తే.

**ఇన్నేళ్ల సినీ కెరీర్ తర్వాత కూడా కొత్త సినిమా విడుదలప్పుడు ఆందోళన పడుతున్నారా? లేదా మారిపోయారా?**

ఒకప్పటితో పోలిస్తే, ఇప్పుడు నేను కొంత ప్రశాంతంగా ఉంటున్నా.

**షూటింగ్ పూర్తయిన తర్వాత కూడా మీరు మర్చిపోలేని సంభాషణలు, డైలాగ్స్ ఏమైనా ఉన్నాయా?**

క్లైమాక్స్ లో వచ్చే సంభాషణలన్నీ అవే. ఈ మూవీ కాన్సెప్ట్ విన్న వెంటనే కచ్చితంగా చేయాలనిపించింది. షూటింగ్ పూర్తయిన తర్వాత నా మదిలో మెదిలిన మొదటి ఆలోచన ఏంటో తెలుసా? ఎప్పుడెప్పుడు ఈ మూవీ మీకు చూపిస్తానా? అని అనుకుంటూ ఉన్నా.

**మళ్లీ మిమ్మల్ని ఒక మంచి లవ్ స్టోరీలో చూడాలని ఉంది!**

అది జరగవచ్చు. జరగకపోనూ వచ్చు.

**ప్రతి సినిమాకు ఒక హృదయం లేదా ఆత్మ ఉంటుంది. ఈ సినిమాకు అదేంటి?**

కుటుంబం

**అభిమానులను సైతం షాక్ కు గురిచేసే మీ ఫన్నీ అలవాటు ఏంటో చెప్పండి?**

ఎందుకో తెలియదు.. నా మొబైల్ లోని యాప్స్ని పదే పదే ఓపెన్ చేసి క్లోజ్ చేస్తుంటా.

**ఇటీవల కాలంలో మీరు చూసి, మీకు నచ్చిన చిత్రం?**

అబ్సెషన్

## వెంకటేశ్ - అనిల్ సినిమా మొదలు

**• రాఘవేంద్రరావు దర్శకత్వంలో తొలి షాట్..**

కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు అనిల్ రావిపూడి మరోసారి సంక్రాంతి బరిలో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. అనిల్ దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో ఓ సినిమా రానుంది. 'ఘ్ఞజుఊఝజీజా5' అనే వర్కింగ్ టైటిల్ తో ఇది ప్రచారంలో ఉంది. ఈ చిత్రం షూటింగ్ నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. రాఘవేంద్రరావు, దిల్ రాజు, సురేశ్ బాబు, అల్లు అరవింద్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో తొలి షాట్ చిత్రీకరణ జరగ్గా.. ఈ సినిమా రూ.200 కోట్లు వసూళ్లు సాధించాలని కోరుకుంటూ అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. దిల్రాజు స్క్రిప్ట్ అందించి టీమ్ కు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

ఇందులో వెంకటేశ్ కు జోడీగా కీర్తి సురేశ్, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తున్నారు. వెంకటేశ్ - అనిల్ రావిపూడి కాంబినేషన్ లో గతేడాది పండక్కి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ బరిలో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే జోష్ తో మరోసారి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 2027 సంక్రాంతి లక్ష్యంగా శరవేగంగా షూటింగ్ జరగనుంది. ఇక వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం:47' అనే సినిమా చేస్తున్నారు.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.